


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 141 | బుధవారం 29 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50



## పాలనా సౌలభ్యానికే జిల్లాల
# పునర్వ్యవస్థీకరణ

- పవన్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలపై ఇప్పటివరకు 12 వేల వినతులు
- గత తప్పులన్నీ సరిచేయాలి.. కొత్త ఇబ్బందులు రాకుండా చూడాలి
- భవిష్యత్‌లో జరిగే నియోజకవర్గాల పునర్విభజననూ దృష్టిలో పెట్టుకోవాలి
- సీఎం దిశా నిర్దేశం.. కొత్త జిల్లాలుగా మార్కాపురం, మదనపల్లె!

**అమరావతి, సూర్యవాస్తవం:** ప్రజాభీష్టం, పరిపాలనా సౌలభ్యం లక్ష్యంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ దిశగానే మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. ఈ - మిగతా 2లో..

## కులమతాలకంటే...
# మానవత్వమే మిన్న..!

### మౌలానా అర్షద్ మదని..

- వరద బాధితులకు భారీ సాయం..
- సేవాకార్యక్రమాల్లో జమాత్ ముందంజ
- నిరాశ్రయులకు కొత్త ఇళ్ళు
- విపత్తు బాధితులకు ఊరట
- మౌలానా పిలుపునకు విశేష స్పందన
- కుప్పతెప్పలుగా సహాయక సామగ్రి..

**సూర్య వాస్తవం, న్యూఢిల్లీ, ప్రతినిధి**

జమ్మూ, పంజాబ్, హిమాచల్ రాష్ట్రాల్లో ఇటీవల భారీ వరదల కారణంగా జరిగిన నష్టాన్ని జమాతే ఉలేమా హింద్ జాతీయ సహాయక బృందం అంచనా వేసింది. ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు మౌలానా అర్షద్ మదనీ ఆదేశాల మేరకు ఆ సంస్థ జాతీయ నాయకత్వం వరద ప్రభావిత ప్రాంతాల్లో వాస్తవ గణాంకాలు సేకరించేందుకు సర్వే బృందాలు ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జమాత్‌కు సంబంధించిన సహాయక బృందాలు మొదటి దశలో జమ్మూ లోని ఉధమ్‌పూర్ జిల్లాలో 15 ఇళ్ళ నిర్మాణ పనులు చేపట్టాయి. ప్రాథమిక పునరావాసం కోసం, పఠాన్‌కోట్ ప్రాంతంలోని 33 కుటుంబాలకు ఇళ్లు కేటాయించాయి. వీటిలో 7 హిందూ కుటుంబాలు కూడా ఉన్నాయి. ప్రతి బాధిత కుటుంబానికి నగదు మరియు వస్తువుల రూపంలో ఒక్కో ఇంటికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని జమాత్ అందజేసింది.



- మిగతా 2లో..

# సమస్యల పరిష్కారానికి కృషి

### శాసనసభ్యుల కమిటీ బృందం

**అనంతపురం కలెక్టరేట్, సూర్యవాస్తవం:** రాష్ట్రంలో షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల ఆంధ్ర శాసన కమిటీ కృషి చేస్తోందని కమిటీ అధ్యక్షులు కుమార రాజా తెలిపారు. అనంతపురం ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఆయా సంఘాల నాయకులు, ప్రజల నుండి మంగళవారం వివిధ ఫిర్యాదులను ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, శాసనసభ్యులు ఎంఎస్ రాజు, బోనెల విజయచంద్ర, రోషన్ కుమార్‌తో కలిసి ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కుమార రాజా మాట్లాడుతూ జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజల సమస్యలు పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా శాసనసభ కమిటీ బృందం చర్యలు



తీసుకుంటుందని చెప్పారు. వినతులకు సంబంధించి ఆయా శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. - మిగతా 2లో..



# వసతి గృహ విద్యార్థుల సంరక్షణపై దృష్టి

### బీసీ సంక్షేమశాఖ మంత్రి మంత్రి సవిత

**అమరావతి, సూర్య వాస్తవం:** మొంథా తుపాను నుంచి బిసి వసతి గృహాలు, ఎంజెపి స్కూళ్లలో చదువుకుంటున్న విద్యార్థుల సంరక్షణపై దృష్టి సారించాలని అధికారులను బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత ఆదేశించారు. తుపాను తీవ్రంగా ఉండే ప్రాంతాల్లోని విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బిసి సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, ఎంజెపి పాఠశాలల కార్యదర్శి మాధవీలతతో ఆమె మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుపాను నేపథ్యంలో బిసి హాస్టళ్ల విద్యార్థుల రక్షణకు - మిగతా 2లో..




సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## శ్రీవారి ఆలయంలో 10 రోజులు
# వైకుంఠ ద్వార దర్శనం

- కాణిపాకంలో నూతన యాత్రికుల వసతి సముదాయం నిర్మాణం
- టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

**తిరుమల, సూర్య వాస్తవం:** భక్తులకు 10 రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు చెప్పారు. అదేవిధంగా ధర్మ ప్రచారంలో భాగంగా గ్రామాల్లో భజన మందిరాలు నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో కలసి మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యాంశాలు. 1.ఇటీవల



శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. బ్రహ్మోత్సవాల విజయవంతంలో భాగస్వాములైన ఉద్యోగులు, జిల్లా, పోలీసు యంత్రాంగం, ఇతర విభాగాల సిబ్బందికి, శ్రీవారి సేవకులకు, సహకరించిన మీడియాకు, భక్తులకు టీటీడీ బోర్డు అభినందనలు తెలియజేస్తోంది. తిరుమలలో గదుల టారీఫ్ లను పరిశీలించి నివేదిక సమర్పించడానికి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో టిటిడి ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం. పర్మినెంట్ ఉద్యోగులకు రూ.15,400, కాంట్రాక్ట్ / - మిగతా 2లో..



# శ్రీవారి ఆలయంలో 10 రోజులు వైకుంఠ ద్వార దర్శనం

(మొదటిపేజీ తరువాయి)

జౌట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.7,535 ఇవ్వాలని నిర్ణయం. అయితే బ్రహ్మోత్సవాలలో పనిచేసిన తిరుమల, తిరుపతికి చెందిన సిబ్బందికి అదనంగా 10 శాతం ఇవ్వాలని నిర్ణయం. టీటీడీ గోశాల నిర్వహణకు సబంధించి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా గోశాల నిర్వహణ, అభివృద్ధిపై తదుపరి చర్యలు తీసుకుంటాం.ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం రూ.37 కోట్ల వ్యయంతో 100 గదులను ఆధునిక వసతులతో నూతన అతిధి భవనాన్ని నిర్మించేందుకు ఆమోదం. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయం వద్ద భక్తులకు మరింత ఆహ్లాదకర, ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందించేందుకు రూ.2.96 కోట్లతో 1.35 ఎకరాల్లో పవిత్ర వనం ఏర్పాటుకు ఆమోదం.. కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద యాత్రికుల వసతి సముదాయం, సామూహిక వివాహాలకు ప్రత్యేక హాల్స్ నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరుకు ఆమోదం. ఇందుకు సంబంధించి ప్రభుత్వ అనుమతి కొరకు పంపాపలని నిర్ణయం. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చెన్నై టి.నగర్ లోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం పరిధిలో ఉన్న 6,227 చ.అ. స్థలాన్ని దాతల సహకారంతో రూ.14 కోట్లతో కొనుగోలు చేసేందుకు నిర్ణయం .. తెలంగాణ రాష్ట్రం, కరీంనగర్ లో శ్రీ పద్మావతి మరియు శ్రీ ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఆలయ ప్రాకారం, రాజగోపురం, నాలుగు మాడ వీధులు, తదితర మౌళిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే ఆమోదించిన రూ.20 కోట్ల నిధులతో పాటు అదనంగా మరో రూ. 10 కోట్లు దాతల ద్వారా సేకరించాలని నిర్ణయం.. వేద విశ్వవిద్యాలయం విసి ఆచార్య రాణి సదా శివమూర్తిని తొలగించాలని నిర్ణయం.. టీటీడీ కొనుగోలు విభాగంలో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై సమగ్ర విచారణకు ఎసిబితో విచారణ జరపాలని నిర్ణయం. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో శ్రీ వెంకయ్య చౌదరి, పలువురు బోర్డు సభ్యులు, జెఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

అంతకుముందు అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అనంతపురం ఆర్‌డిఒ కేశవ నాయుడు పలువురు నాయకులు కమిటీ బృందానికి పుష్పగుచ్ఛాలను, మొక్కలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని కుమార్ రాజా స్పష్టం చేశారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో శాసనసభ కమిటీ బృందం సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే వినతులు స్వీకరించి వాటిని మినిట్స్ రూపంలో రికార్డ్ చేసి శాసనసభకు అందజేస్తున్నామని వివరించారు. సంక్షేమ పథకాల అమలు, పెండింగ్లో ఉన్న అట్రాసిటీ కేసుల స్థితి, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ స్థితి తదితర అంశాలపై నివేదికలను అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఒ ఆనంద్, ఎస్‌పి పి జగదీష్, డిఆర్‌ఒ ఎ మలోల, తాడిపత్రి ఎఎస్‌పి రోహిత్ కుమార్ చౌదరి, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు, జిల్లా స్థాయి అధికారులు, ఎస్‌సి, ఎస్‌టి సంఘాలకు చెందిన ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కులమతాల కంటే..
# మానవత్వమే మిన్న.. !

(మొదటిపేజీ తరువాయి)

**ఐక్యత, మానవత్వం ముఖ్యం:**

ఈ సదర్భంగా జరిగిన సహాయ, పునరావాస కార్యక్రమంలో ఆ సంస్థ అధినేత మౌలానా అర్షద్ మదనీ మాట్లాడుతూ.. తమ సంస్థ సేవా కార్యక్రమాల పట్ల స్పష్టత నిచ్చారు. మతం ఆధారంగా కాక , మానవతా విలువల ఆధారంగా తమ సంస్థ సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. సామాజిక విద్వేషం పెంచే శక్తులు తమ ఉదాత్త కార్యచరణ చూసి గుణపాఠం నేర్చుకోవాలన్నారు. మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ మానవతా విలువలకు పెద్దపీట వేశారని, ప్రవక్త అడుగుజాడలు అనుసరించి, జమాత్ పలు సేవా కార్యక్రమాలు నిరంతరం చేపడుతుందన్నారు. ప్రజలకు కష్ట కష్టకాలంలో సహాయ సహకారాలు, పునరావాస కార్యక్రమాలు చేపట్టడం తమ సంస్థ బాధ్యతన్నారు. ప్రవక్త ప్రవచనాల స్ఫూర్తితోనే జమీయతుల్ ఉలేమా హింద్ పంజాబ్, జమ్మూ మరియు హిమాచల్‌లో ఘోర వరదల కారణంగా నిరాశ్రయులైన వేలాది మంది బాధితులకు పునరావాసంకల్పించిందన్నారు.

**విపత్తులో నిస్వార్థ సేవలు:**

విపత్తు సంభవించిన వెంటనే తమ సంస్థ కార్యకర్తలు సహాయక చర్యల్లో నిమగ్న మయ్యారని అర్షద్ మదనీ పేర్కొన్నారు. తమ సంస్థకు చెందిన సేవక బృందాలు తమ సమయాన్నీ, ధనాన్ని , శ్రమనూ, పూర్తిగా బాధితుల సేవలో వినియో గించారని, వారి సేవాతత్పరత కు ఇహపర లోకాల సాఫల్య%శీ% దక్కాలని మౌలానా మదనీ అభిలషించారు. ఇప్పటికీ అనేక చోట్ల తమ సంస్థ ఆధ్వర్యంలో సహాయక చర్యలు కొనసాగు తున్నాయన్నారు. తన స్వీయ పర్యవేక్షణలో జమాత్ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయన్నారు. ఈ మూడు రాష్ట్రాల వరద ప్రభావిత ప్రాంతాల్లో సర్వే పూర్తిచేసి, ప్రభుత్వం నుండి సహాయం అందని, లేదా పొందని వారిపై దృష్టి సారించినట్లు తెలిపారు. జమ్మూ లోని ఉద్దంపూర్ జిల్లా సర్వే పనులు, సత్వర సేవలు రాజస్థాన్ అధ్యక్షులు మౌలానా రషీద్ పర్యవేక్షణలో కొనసాగు తున్నాయన్నారు. అదే సమయంలో, మౌలానా అబ్దుల్ ఖదీర్ (నాజిమ్ తంజీమ్-ఓ-తరక్కీ, జమీ యతుల్ ఉలమా-ఎ-హింద్) మరియు ముఫ్తీ యూసుఫ్ నేతృ త్వంలోని సేవా బృందాలు పఠాన్‌కోట్ జిల్లాలోని ఫాజిల్కా గ్రామాన్ని పలు విడతలు సందర్శించా యన్నారు. వరదలో పూర్తిగా దెబ్బతిన్న 33 కుటుంబాలను కలసి, ప్రతి కుటుంబానికి నగదు మరియు అవసరమైన వస్తువుల రూపంలో రూ.50,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేశా యన్నారు. గుర్తించిన బాధితుల్లో 7 హిందూ కుటుంబాలు కూడా ఉన్నా యన్నారు. తమ నిస్వార్థ సేవను బాధిత కుటుంబాలు గుర్తించి, సేవల పట్ల తమ సంస్థకు కృతజ్ఞత తెలియజేస్తు న్నాయన్నారు. పంజాబ్, జమ్మూ మరియు హిమాచల్ లోని వరద పరిస్థితిని "మానవ విషాదం"గా పేర్కొన్నారు. విపత్తు బాధితుకు సహాయం చేయడం తమ కర్తవ్యమని, ఆ బాధ్యత సృష్టింకర్త ప్రసన్నత కోసం మాత్రమే తాము నిర్వర్తిస్తామన్నారు.

**విపత్తు దైవ సంకల్పం:**

" విపత్తు ఏ మతాన్ని అడిగి రాదని, అది అందరినీ సమానంగా ప్రభావితం చేస్తుందని.. అందుకే తమ సంస్థ కుల మతాలకు అతీతంగా మానవతా ధర్మంతో సహాయం చేస్తోందన్నారు. "ఉధమ్‌పూర్ మాదిరిగానే, పంజాబ్‌లో కూడా బీద కుటుంబాలకు ఇళ్లు నిర్మించేందుకు తమ సంస్థ పూర్తి స్థాయి ప్రయత్నం కొనసాగిస్తున్నారు. ఇదే తరహాలో తమ సంస్థ గతంలో కేరళ సహా అనేక రాష్ట్రాల్లో ఇదే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అప్పట్లో కేరళ లోని అనేక చోట్ల హిందూ, ముస్లిం, క్రైస్తవ సమాజాలకు చెందిన బాధితులందరికీ తమ సంస్థ ఆధ్వర్యంలో సహాయం అందించామన్నారు.

"మన దేశం సహనానికి, ఐక్యతకు నిదర్శనమన్నారు. కానీ కొన్ని విద్వేష శక్తులు ద్వేష రాజకీయాలతో ఆ ఐక్య తను దెబ్బతీస్తున్నాయని, అటువంటి శక్తుల పట్ల దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండి.. దేశాన్ని కాపాడుకోవాలని, పిలుపు నిచ్చారు.

**సర్వే నివేదిక వెల్లడి:**

వరద ప్రభావిత ప్రాంతాల సర్వే నివేదికను, జమీయతుల్ ఉలమా రాజస్థాన్ అధ్యక్షుడు మౌలానా మహమ్మద్ రషీద్ ఈ సందర్భంగా వెల్లడించారు.

సర్వేలో 15 కుటుంబాలు పూర్తిగా గృహరహితమై ప్రభుత్వ సహాయం పొంద లేదని తేలింది. వీరికి కొత్త ఇళ్లు నిర్మించేందుకు జమీయతుల్ ఉలమా రాజస్థాన్ బాధ్యత తీసుకుందన్నారు. జమ్మూ-శ్రీనగర్ హైవేపై కొండచరియల కారణంగా సహాయక బృందం ఆలస్యంగా చేరిందన్నారు. అక్కడి వరద నష్టాన్ని సహాయక బృందం అంచనా వేసిందని తెలిపారు. అక్కడ 83 ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, 32 ఇళ్ల స్థలాలు కూడావరదలో కొట్టుకుపోయాయన్నారు. ఒక మస్జిద్ మరియు ఒక సమాధి స్థలం కూడా ధ్వంసం అయిందన్నారు. తహసీల్‌లోని రైంగి గ్రామంలో 25 కంటే ఎక్కువ ఇళ్లు కూలిపోయా యన్నారు. జమీయతుల్ ఉలమా మొదటగా అక్కడ సహాయక సరుకులు పంపిందన్నారు. పంజాబ్‌లో 13 జిల్లాలు వరదలకు తీవ్రంగా ప్రభావితమయ్యాయని తెలిపారు.

**మౌలానా పిలుపునకు అపూర్వ స్పందన:**

జమాత్ అధినేత మౌలానా మదనీ బాధితులకు సాయం చేయమని ఇచ్చిన పిలుపుతో దేశవ్యాప్తంగా ఉన్న ముస్లిం సామాజిక వర్గం స్పందించి పెద్దఎత్తున సహాయక వస్తువులు పంపింది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల శాఖలు కూడా సహాయానికి చేరుకున్నాయి. మౌలానా మదనీ పిలుపునకు దేశ వ్యాప్తంగా విపరీత స్పందన వచ్చి కుప్పలు తెప్పలుగా సహాయక సామాగ్రి చేరడంతో, పంజాబ్ అధికారులు ప్రజలకు "ఇంకా సహాయక వస్తువులు పంపవద్దు ం నిల్వ చేసుకునే స్థలం లేదు" అని ప్రకటించాల్సి వచ్చింది. జమీయతుల్ ఉలమా-ఎ-హింద్ ఇప్పుడు పంజాబ్, హిమాచల్ ప్రాంతాల్లో పూర్తిగా నాశనమైన ఇళ్లు ఎంత ఉన్నాయో, ఎవరికి మళ్లీ ఇళ్లు నిర్మించాల్సిన అవసరం ఉందో సర్వే చేస్తోంది. ప్రభుత్వ సహాయం అందని కుటుంబాలకు తమ సామ ర్థ్యానికి అనుగుణంగా కొత్త ఇళ్లు నిర్మించనుంది.

## శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ

**తిరుమల, సూర్య వాస్తవం:** తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను టీటీడీ ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో కలిసి ఆవిష్కరించారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం సాయంత్రం టీటీడీ బోర్డు సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, నవంబరు 17 నుండి 25వ తేదీ వరకు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించ నున్నట్లు చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు చెప్పారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.




# అల్లకల్లోలం

- తీరాన్ని తాకిన మొంథా
- కోస్తా అంతా భారీ వర్షాలు
- ఉవ్వెత్తున ఎగిసిన రాకాసి అలలు
- మరో రెండు రోజులు తుపాన్ ప్రభావం
- 31వ తేది వరకు విద్యాసంస్థలకు సెలవు



**అమరావతి, సూర్య వాస్తవం: :** రెండు, మూడు రోజులుగా తీరప్రాంతాన్ని వణికించిన మొంథా తుపాన్ తీరాన్ని తాకింది. మంగళవారం రాత్రి 7:45 గంటల ప్రాంతంలో కాకినాడ-మచిలీపట్నం మధ్య అంతర్వేదిపాలెం సమీపంలో తుపాన్ తీరాన్ని తాకినట్టు వాతావరణ శాఖ ప్రకటించింది. మంగళవారం అర్ధరాత్రికిగాని, బుధవారం తెల్లవారుజామున గానీ పూర్తిగా తీరాన్ని దాటుతుందని భావిస్తున్నారు. తుపాన్ పూర్తిగా తీరాన్ని దాటిన తరువాత కూడా మరో రెండు రోజుల పాటు ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తుపాన్ తీరాన్ని తాకిన సమయంలో దాదాపుగా కోస్తా ప్రాంతమంతా పెద్ద ఎత్తున ఈదురుగాలులతో పాటు కుంభవృష్టి కురిసింది. సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగిసి పడ్డాయి. ఉప్పాడ, విశాఖ, ప్రకాశంతోపాటు నెల్లూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రాకాసి అలలు విరుచుకుపడినట్లు వార్తలు వచ్చాయి. ఈదురుగాలుల ధాటికి రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అనేకచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. శిథిలావస్థలో ఉన్న కొన్ని స్తంభాలను అధికారులే ముందు జాగ్రత్త చర్యగా తొలగించారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో తీరప్రాంతంలోని అనేక గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఈ గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు కనీసం రెండు రోజుల సమయం పడుతుందని సమాచారం. ఈదురుగాలుల జోరు కొనసాగుతుండటంతో ముందు జాగ్రత్త చర్యగా జాతీయ రహదారిపై భారీ వాహనాలను అధికారులు నిలిపివేశారు. తుపాన్ తీరాన్ని తాకడానికి ఒకటి, రెండు గంటల ముందే రాష్ట్ర ప్రభుత్వం నుండి ఈ మేరకు ఆదేశాలు అందాయి. దీంతో దాదాపుగా తీర ప్రాంతంలోని అన్ని జిల్లాల్లోనూ భారీ వాహనాలను అడ్డుకున్నారు. దీంతో అనేకచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. జాతీయ రహదారిపై కిలోమీటర్ల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. ఈదురుగాలుల తీవ్రత తగ్గిన తరువాత బుధవారం ఉదయం వీటికి అనుమతి లభించే అవకాశం ఉంది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో అన్ని విద్యాసంస్థలకు ఈ నెల 31వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. తుపాన్ ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల పరిధిలోని 403 మండలాలపై ఉందని అధికార వర్గాలు తెలిపాయి. తీరం దాటిన తరువాత ఉమ్మడి విశాఖ, ఉమ్మడి గోదావరి జిల్లాలు, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రభావం అధికంగా ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఆ జిల్లాల అధికారులను పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. 38 వేల హెక్టార్లలో పంటనష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనావేశారు. 1.38 లక్షల హెక్టార్లలో ఉద్యానపంటలు కూడా ప్రభావితమైనట్లు అంచనావేశారు.

**వేల మంది పునరావాస కేంద్రాలకు..**

గాలులు, సముద్రం హోరుకు భయపడిన తీరప్రాంత వాసులు పునరావస కేంద్రాలకు తరలివచ్చారు. నరసా పురం, మొగల్తూరు మండలాల్లోని 19 కేంద్రాలకు వారిని తరలించారు. అత్యధికంగా పీఎంలంక క్రేందంలో 2వేల మంది పునరావాసం పొందారు. కేపీపాలెం ఉన్నత పాఠ శాల, మెట్రేవు, బీకే మెరక, మోళ్లపర్రు, పేరుపాలెం ఉన్నత పాఠశాల, లైన్ పల్లవపాలెం, పాతపాడు గ్రామాల్లో పునరా వాస కేంద్రాలు ఏర్పాటుచేసి మత్స్యకారులతోపాటు, తుఫాన్ ప్రభావిత గ్రామాల ప్రజలను తరలించారు. ఒక్కసారిగా గ్రామస్థులు రావడంతో చాలాచోట్ల భోజనాలకు ఇబ్బందులు ఏర్పడినా అప్పటికప్పుడు వండి వడ్డించారు. అన్ని కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, జనరేటర్లు ఏర్పాటు చేశారు.

ఉప్పుటేరుల్లో నీటి ప్రవాహం ముందుకు సాగడం లేదు. దర్భరేవు, గొంతేరు, బొంతేరు, వెస్ట్ కుక్కులేరు, ఈస్ట్ కుక్కు లేరు, మాగలేరు డ్రెయిన్ బిగిసి ఉండడంతో నీరు పారక వరి చేలు, ఆక్వా చెరువులోకి ప్రవహించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా కలెక్టర్ నాగరాణి ఏర్పాట్లు చేశారు. పునరావాస కేంద్రాలను ఎస్పీ నయీం అస్మీ, ఆర్డీవో దాసిరా జు, తహసీల్దార్లు, అధికారులు పరిశీలించారు. నరసాపురం నియోజకవర్గంలో 16 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

## సంపాదకీయం

# సెక్స్ వార్ ఫేర్

టెక్నాలజీ పెరిగేకొద్దీ.. శత్రువుని దెబ్బతీసేందుకు.. వారి రహస్యాలను దొంగిలించే పద్ధతి మారుతుంది. అలా.. ఇప్పుడు కొత్తగా ట్రెండింగ్‌లోకి వచ్చిందే.. సెక్స్ వార్ ఫేర్. ఎస్.. సిలికాన్ వ్యాలీలో నడుస్తున్న సరికొత్త గూఢచర్యం ఇది. వలపు వల విసిరి.. దిగ్గజ టెక్ కంపెనీల ట్రేడ్ సీక్రెట్లని దొంగిలించేస్తున్నారు. దిగ్గజ టెక్ కంపెనీలన్నీ ఉండే.. సిలికాన్ వ్యాలీలో.. అకస్మాత్తుగా సెక్స్ వార్‌ఫేర్ పెరిగిపోయింది. చైనా, రష్యాకు చెందిన ఆపరేటర్లు.. టెక్ కంపెనీల్లోకి చొరబడేందుకు, అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను ప్రలోభ పెట్టేందుకు, అక్కడి ట్రేడ్ సీక్రెట్స్‌ని.. దొంగిలించేందుకు అందమైన, ఆకర్షణీయమైన మహిళలను వాడుతున్నట్లు తేలింది. ఇదే.. ఇప్పుడు అందరినీ షాక్‌కి గురిచేస్తోంది. అంతేకాదు.. ఓ గూఢచారి మహిళ.. ఓ టెకీని పెళ్లి కూడా చేసుకుంది. ఆమెను.. అతను ఓ మీటింగ్‌లో కలిశాడు. ఆమె అందమైనదే కాదు.. ఎంతో తెలివైంది కూడా. అతనంటే నిజంగానే ఎంతో ప్రేమ ఉన్నట్లు, ఇష్టం ఉన్నట్లు నమ్మించింది. కొన్నేళ్ల తర్వాత.. ఆమె ఓ ఇంటలిజెన్స్ ఆపరేషన్‌లో భాగమని, అమెరికా వాడే టెక్నాలజీ నుంచి అనేక రహస్యాలను తెలుసుకునేందుకు వచ్చిందని.. తెలుసుకున్నాడు. ఇదే.. ఇప్పుడు సిలికాన్ వ్యాలీలో నడుస్తున్న లేటెస్ట్ స్పై ఆపరేషన్. ఎరగా అందమైన, ఆకర్షణీయమైన మహిళలు. చైనా, రష్యాకు చెందిన కొందరు ఆపరేటర్లు.. అమెరికా టెక్ కంపెనీల్లోకి చొరబడి, అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను ప్రలోభపెట్టేందుకు అందమైన మహిళల్ని ఎరగా వాడుతున్నట్లు తేలింది. కొన్ని సందర్భాల్లో.. ఆ గూఢచారి మహిళలు.. తమ టార్గెట్లను పెళ్లి కూడా చేసుకుంటారు. టెక్నాలజీపరమైన రహస్యాలను దొంగిలించే క్రమంలో.. ఎక్కువ కాలం వారితో ఉండాల్సి వచ్చినప్పుడు.. పిల్లలను కూడా కంటారు. అందుకోసమే.. ఇంటలిజెన్స్ ఎక్స్‌పర్ట్స్ దీనిని సెక్స్ వార్‌ఫేర్ అని పిలుస్తున్నారు. ఇదంతా.. టెక్ ప్రపంచంలో పెరుగుతున్న అమెరికా ఆధిపత్యానికి ముప్పును సూచిస్తోందని చెబుతున్నారు. చైనాలో పెట్టుబడులు పెట్టే.. అమెరికా కంపెనీలకు సలహాలు ఇచ్చే నిపుణులు.. దీనిని గమనించారు. లింక్డ్ ఇన్ లాంటి ప్లాట్ ఫామ్స్‌లో.. అందమైన యువతుల నుంచి తమకు రిక్వెస్ట్‌లు వస్తున్నాయంటున్నారు. ఈ మధ్యకాలంలో సిలికాన్ వ్యాలీలో ఈ తరహా గూఢచర్యం బాగా పెరిగిందని కౌంటర్ ఇంటలిజెన్స్ నిపుణులు చెబుతున్నారు. ఇటీవల.. చైనా పెట్టుబడి నష్టాలపై వర్జీనియాలో జరిగిన వ్యాపార సమావేశంలోనూ.. ఇద్దరు ఆకర్షణీయమైన చైనీస్ లేడీస్ ప్రవేశించడానికి ప్రయత్నించినట్లు గుర్తించారు. ఇది.. కచ్చితంగా అమెరికా ఇంటలిజెన్స్ వైఫల్యమే అంటున్నారు. టెక్ కంపెనీల సీక్రెట్స్ దొంగిలిస్తున్న గూఢచారులు. అయితే.. సెక్స్ బేస్డ్ గూఢచర్యం ఇప్పుడున్న ముప్పులో ఓ పార్ట్ మాత్రమే. యూఎస్ బిజినెస్ ప్లాన్స్‌ని సేకరించేందుకు.. చైనా అమెరికా గడ్డపై స్టార్టప్ కాంపిటీషన్స్ నిర్వహిస్తోంది. ఈ ఆపరేషన్‌కి.. రష్యా, చైనా.. తమ దేశ పౌరులు, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు, క్రిప్టో అనలిస్టులను.. అనధికార నిఘా ఏజెంట్లుగా వాడుతుండటం వల్ల.. ఈ కార్యకలాపాలను గుర్తించడం కష్టతరమవుతోందని నిపుణులు అంటున్నారు. మరోవైపు.. అందమైన తమ దేశపు మహిళలకు.. ఓ టార్గెట్‌ని సెలక్ట్ చేయడం, వారిని పెళ్లి చేసుకోవడం.. ఓ లక్ష్యంతో పిల్లల్ని కనడం, జీవితాంతం.. టెక్ సీక్రెట్స్ సేకరించే ఆపరేషన్ నిర్వహించడం లాంటివి చేస్తున్నారు. ఈ రకంగా చేయడం వల్ల.. అస్సలు అనుమానమే వచ్చే పరిస్థితి లేదంటున్నారు. ఈ విధంగా.. మేధో సంపత్తిని దొంగిలించేందుకు.. ఏడాదికి 600 బిలియన్ డాలర్ల దాకా ఖర్చవుతోంది. ఇదంతా.. ఎక్కువగా చైనా నుంచే జరుగుతోంది. స్టార్టప్‌లు.. చైనా ఇన్వెస్టర్లతో తమ బిజినెస్ ప్లాన్స్‌ని పంచుకుంటే.. రహస్యాలను కోల్పోయే ప్రమాదం ఉంది. లేనిపక్షంలో.. వాళ్లు చైనాకే వెళ్లాల్సి వచ్చే ప్రమాదం కూడా ఉంది. భవిష్యత్తుల్లో అమెరికా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదా? సిలికాన్ వ్యాలీ.. ఇప్పుడు సాఫ్ట్ ఎకనమిక్ గూఢచర్యానికి కేంద్రంగా మారింది. టెక్నాలజీతో పాటు ట్రేడ్ సీక్రెట్స్‌ని కూడా టార్గెట్‌గా చేసుకుంది. చైనా దీనిని.. డ్రాఫ్ట్‌గా పిలుస్తోంది. యూఎస్ యాక్సెస్‌ని నిరోధించేందుకు.. డీవోడీ నిధులతో కూడిన స్టార్టప్‌లలో వాటాలు కొనుగోలు చేస్తోంది. సిలికాన్ వ్యాలీ ఓపెన్ కల్చర్ కూడా గూఢచారులు ఎంట్రీ ఇచ్చేందుకు.. రూట్ క్లియర్ చేస్తోంది. సౌత్ కొరియా, ఇజ్రాయెల్ లాంటి అమెరికా మిత్రదేశాలు కూడా.. సైలెంట్‌గా తమకు కావాల్సిన సమాచారాన్ని సేకరిస్తుంటాయని.. ఇంటలిజెన్స్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. 2017లో రష్యన్ కాన్సులేట్ మూసివేసిన తర్వాత కూడా.. రష్యా హానీపాట్స్, మధ్యవర్తులను ఉపయోగిస్తోంది. ఇక.. చైనా అయితే.. టెక్నాలజీ, ఐపీ అడ్రస్‌ల కోసం.. ఓ భారీ వలనే విసురుతోంది. ఈ విషయంలో.. యూఎస్ కౌంటర్ ఇంటలిజెన్స్ అనేక అడ్డంకులను ఎదుర్కొంటోంది. ఎందుకంటే.. స్టార్టప్స్ తరచుగా బెదిరింపులను తక్కువగా రిపోర్ట్ చేస్తాయ్. మరోవైపు.. సిలికాన్ వ్యాలీలోని ఓపెన్ కల్చర్.. స్పై ఆపరేషన్లను సులభతరం చేస్తోంది. అందువల్లే.. చైనా, రష్యా.. హానీ ట్రాప్ పద్ధతుల్లో.. దిగ్గజ టెక్ కంపెనీల నుంచి ట్రేడ్ సీక్రెట్స్ దొంగిలిస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయ్. బడా టెక్ కంపెనీల్లో.. విలువైన సమాచారాన్ని యాక్సెస్ చేయగలిగే వారిని.. ప్రేమలోకి దించడం గానీ, వలపు వల విసరడం గానీ చేసి.. తమకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టుకుంటున్నారు. తమ సంబంధాలతో.. మేధో సంపత్తి, మిలటరీ టెక్నాలజీతో పాటు ఇతర రహస్య సమాచారాన్ని దొంగిలించడమే లక్ష్యంగా.. గూఢచర్యం చేస్తున్నారు. చైనా, రష్యా సిలికాన్ వ్యాలీనే సెలక్ట్ చేసుకోవడానికి ఓ రీజన్ ఉంది. ఇక్కడ.. సెమీ కండక్టర్ల నుంచి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ దాకా.. కీలకమైన టెక్నాలజీలన్నింటిని.. సిలికాన్ వ్యాలీ సెంటర్‌గా ఉంది. ఇలా.. మేధో సంపత్తి దొంగతనం ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థకు.. ఏడాదికి కొన్ని వందల బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు. చైనాకు చెందిన వారి వీసాలను రద్దు చేస్తున్న అమెరికా. హానీ ట్రాప్, సెక్స్ వార్‌ఫేర్ లాంటి గూఢచర్య పద్ధతులు.. టెక్ కంపెనీల్లో ఇంటర్నల్ టెన్షన్స్‌ని పెంచుతాయ్. సంస్థలకు తీవ్రమైన ఆర్థిక, జాతీయ భద్రతా నష్టాలను కలిగిస్తాయ్. ఇలాంటి ఎన్నో రిపోర్ట్స్, న్యూస్.. పబ్లిక్ డొమైన్‌లో ఉన్నప్పటికీ.. జనంలో చర్చ జరిగినప్పటికీ.. గూఢచర్యాన్ని ఆపడం కష్టమవుతుంది. ఎందుకంటే.. స్పై ఆపరేషన్లన్నీ.. చాలా సీక్రెట్‌గా జరుగుతుంటాయ్. దొంగిలించబడిన మేధో సంపత్తితో.. విదేశీ ప్రత్యర్థులు.. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఖర్చు లేకుండా.. దాదాపు ఒకే తరహా ఉత్పత్తులను తక్కువ ధరకు విక్రయిస్తారు. దీనివల్ల.. అమెరికన్ కంపెనీల మార్కెట్ వాటా తగ్గిపోతుంది. మిలటరీకి సంబంధించిన సున్నితమైన టెక్నాలజీ దొంగిలించడం వల్ల.. జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. ఎఫ్ బీఐ తో పాటు ఇతర గూఢచార సంస్థలు.. సిలికాన్ వ్యాలీతో పాటు తమ డిఫెన్స్ పరిశ్రమలపైనా నిఘా పెంచాయి. ముఖ్యంగా.. ఈ తరహా సరికొత్త వార్‌ఫేర్‌ని నిరోధించేందుకు చురుగ్గా పనిచేస్తున్నాయ్. ఇప్పటికే.. చైనాకు చెందిన విద్యార్థులు, పరిశోధకులు గూఢచార కార్యకలాపాలు చేస్తున్నారని అనుమానం వచ్చిన వారి వీసాలను అమెరికా రద్దు చేసింది. విదేశి గూఢచారుల నుంచి అమెరికన్ ఆస్తులను కాపాడుకునేందుకు ప్రయత్నాలు. మరోవైపు.. దిగ్గజ టెక్ కంపెనీలన్నీ.. ఉద్యోగులతో పాటు కొత్తగా జాబ్స్ కోసం అప్లై చేసిన వారికి సంబంధించి.. తనిఖీలను కఠినతరం చేశాయ్. చైనా లింకులున్న వారి పట్ల మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయ్. ముఖ్యంగా.. సైబర్ చొరబాట్లను అరికట్టేందుకు.. కంప్యూటర్ భద్రతా వ్యవస్థలను పటిష్టం చేస్తున్నాయ్. తమ సిబ్బందికి కూడా హానీ ట్రాప్ లాంటి గూఢచర్య వ్యూహాలపై అవగాహన కల్పించేందుకు.. ప్రత్యేక సెషన్స్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో హనీ ట్రాప్ ప్రయత్నాలను గుర్తించేందుకు ఏఐ, మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను డెవలప్ చేస్తున్నారు. విదేశీ గూఢచారుల నుంచి అమెరికన్ ఆస్తులను, మేధో సంపత్తిని, టెక్నాలజీని కాపాడుకునేందుకు.. అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు.

# పార్టీ అంశాలపై చంద్రబాబు దృష్టి

### ◆వార్నింగా... యాక్షనా...



**విజయవాడ, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనను ముగించుకుని అమరావతికి చేరుకున్నారు. కృష్ణా జిల్లాలో నేతల మధ్య విభేదాలపై చంద్రబాబు ఫోకస్ పెట్టే అవకాశముంది. ప్రధానంగా తిరువూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిల మధ్య వివాదం రోడ్డున పడింది. ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడంతో పార్టీని బాగా డ్యామేజీ చేసింది. విదేశాల్లో ఉన్నప్పుడే చంద్రబాబు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫోన్‌చేసి ఎవరినీ పిలిపించి మాట్లాడవద్దని, తాను వచ్చిన తర్వాత ఇద్దరి విషయంలో చర్యలు తీసుకుంటానని చెప్పారు. దీంతో చంద్రబాబు రాకతో ఎవరిపై చర్య చంద్రబాబు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. చంద్రబాబు స్టయిల్ ఆఫ్ యాక్షన్స్ దగ్గర నుంచి చూసిన వారికి ఎవరికైనా .. ఎవరిపైనా చర్యలు ఉండే అవకాశాలు ఉండవన్నది ఒక వాదన. ఆయన పార్టీ అధినేతగా ఇప్పటివరకూ పార్టీ నుంచి సస్పె న్షన్ చేసిన నేతలు చాలా తక్కువ. పార్టీలు మారినప్పుడే వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు తప్పించి, ఇలాంటి వివాదాల విషయంలో ఆయన నేరుగా యాక్షన్ కు దిగే అవకాశం లేదన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై పార్టీ సస్పెన్షన్ వేటు వేయడానికి లైంగిక వేదింపులే కారణం తప్ప పార్టీ విషయంలో రచ్చ కెక్కడం మాత్రం కాదు. ఇప్పుడు తిరువూరు విషయంలోనూ ఇద్దరు నేతలకు హెచ్చరికలతో సరిపెడతారన్నది ఎక్కువమంది నేతల అభిప్రాయంగా కనిపిస్తుంది. ఎందుకంటే ఇద్దరు నేతలు.. సామాజికవర్గం పరంగా చూస్తే గట్టి వారే. ఇటు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు దళిత వర్గానికి చెందినవారు. ఆయనపై చర్య తీసుకుంటే అది తప్పుడు సంకేతాలు వెళతాయని చంద్రబాబు భావించే అవకాశాలున్నాయి. ఇప్పటికే పలుమార్లు వివాదాల్లో చిక్కుకున్న కొలికపూడి శ్రీనివాసరావును హెచ్చరించి పంపారు తప్పించి చర్యలకు దిగక పోవడాన్ని కొందరు ఈ సందర్భంగా గుర్తుచేస్తు న్నారు. ఇప్పుడు కూడా యాక్షన్ ఇలాగే ఉంటుందని అంటున్నారు. ఇక విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కృష్ణా జిల్లాలో బలమైన సామాజికవర్గానికి చెందినవారు కావడం, అందులోనూ ఆయన ఎంపీగా ఉండటంతో ఆయనకు కూడా హెచ్చరికలతో సరిపెడతా రంటు న్నారు. చంద్రబాబు కేవలం ప్రకటనల్లో మాత్రమే సస్పెన్షన్ అంటూ హెచ్చరిస్తారని, చేతలకు వచ్చేసరికి కమిటీ వేసి ఆ వివాదం సమసిపోయేలా చేయడంలో దిట్ట అని సీనియర్ నేతలే అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు దృష్టి పెట్టి తిరువూరు సమస్యకు చెక్ పెట్టే అవకాశాలున్నాయి. అంతే తప్ప యాక్షన్‌కు దిగే అవకాశాలు మాత్రం లేవన్నది వాస్తవం.

# అమరావతి కేంద్రంగా మరో జిల్లా



**విజయవాడ, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుతో పాటు పేర్ల మార్పుపై ప్రభుత్వం చేపట్టిన కసరత్తు చివరి దశకు వచ్చింది. ఈ అంశాలపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం మధ్యాహ్నం సీఎం చంద్రబాబుతో సమావేశం కానుంది. ఈ కీలక భేటీలో జిల్లాల సరిహద్దులు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు, పేర్ల మార్పుపై రాష్ట్రవ్యాప్తంగా అందిన అర్జీలు, వినతులపై చర్చిస్తారు. సీఎం చంద్రబాబు సూచనలు తీసుకుని మంత్రివర్గ ఉపసంఘం తుది నివేదికను రూపొందించనుంది. కొత్త జిల్లాలు, మండలాలు రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించిన ఈ నివేదికను నవంబరు 7వ తేదీన జరిగే ఏపీ కేబినెట్ భేటీలో చర్చించి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ఆ తరువాత ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, చివరగా గెజిట్‌ను విడుదల చేస్తారు. జనగణన ప్రక్రియ ఉన్న కారణంగ ఈ మొత్తం ప్రక్రియను డిసెంబరు 31వతేదీలోగానే పూర్తిచేయాలని కూటమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్, మండల, గ్రామ సరిహద్దులు, పేర్ల మార్పుపై ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఆగస్టు 13న తొలి సమావేశం నిర్వహించి, అనంతరం జిల్లాల వారీగా ప్రజలు, వివిధ వర్గాలు, ప్రజాసంఘాల నుంచి వినతులు స్వీకరించింది. ఇటీవల జరిగిన భేటీలో అందిన అన్ని అర్జీలపై చర్చించి, జిల్లాల అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో కొత్త జిల్లా ఏర్పాటుకు సీఎం చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీ మేరకు రంపచోడవరం, చింతూరు డివిజన్లతోపాటు 4 విలీన మండలాలతో జిల్లా ఏర్పాటుకు ప్రతిపాదన సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం రంపచోడవరం నుంచి జిల్లా కేంద్రమైన పాడేరుకు 187 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. అలాగే, అమరావతి కేంద్రంగా పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు ప్రతిపాదన ఉంది. సచివాలయం, అసెంబ్లీ, కొత్త భవనాల నిర్మాణం పూర్తవుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల నిర్వహణ, ప్రొటోకాల్ విధుల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని అమరావతిని కొత్త జిల్లా ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. వీటితో పాటు మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాల నివేదికను కూడా సమర్పించనున్నారు. మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అందులో భాగంగా మార్కాపురం కేంద్రంగా కనిగిరి, గిద్దలూరు, దర్శి, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటుకు ఉపసంఘం సిఫార్సు చేసింది. అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే అంశంపై స్థానిక ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలనే ప్రతిపాదన ఉంది. రామాయపట్నం పోర్టు ఏర్పాటు చేస్తున్నారు కనుక కందుకూరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కొనసాగించాలా? లేక ప్రకాశం జిల్లాలో చేర్చాలా? అనే అంశంపై రేపు సమావేశంలో డిసైడ్ చేయనున్నారు.

అద్దంకి, మడకశిర సహా సుమారు 10 కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పరిపాలనా సౌలభ్యం మేరకు, ఒక నియోజకవర్గం రెండు, 3 రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉంటే ఒకే నియోజకవర్గ పరిధిలోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆదోని మండలంలో జనాభా ఎక్కువగా ఉన్నందున, ఈ మండలాన్ని విభజించాలని ప్రజల వినతులపైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మండపేట, కొత్తపేట, ఎస్.కోట సహా కొన్ని నియోజకవర్గాలను మరో జిల్లాకు మార్చాలనే ప్రతిపాదనలు ఉపసంఘం సీఎం దృష్టికి తీసుకెళ్లనుంది.

#### న్యూఇయర్ కు ముందే ప్రకటన

న్యూఇయర్‌కు కొత్తగా ఆరు జిల్లాలు. తెలంగాణ నుంచి ఏపీ విడిపోయిన తర్వాత 13 జిల్లాలు ఉండేవి. దాన్ని జగన్ సర్కార్ 26 జిల్లాలుగా మార్చింది. జిల్లా కేంద్రాలు, సరిహద్దులు, జిల్లాల పేర్లపై వివాదం రగడ నలుగుతూనే ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి వివిధ జిల్లాల నుంచి ఎక్కువగా వినతులు వచ్చాయి. వాటిలో కొత్త జిల్లాల ఏర్పాటు వ్యవహారం ఉంది. దీనిపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించిందని తెలుస్తోంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. వచ్చే ఏడాది నుంచి కేంద్రప్రభుత్వం జనగణన చేపట్టనుంది. ఈ నేపథ్యంలో 2026 జనవరి ఒకటి నుంచి 2027 మార్చి చివరకు వరకు జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు, పేర్ల మార్పుకు ఎలాంటి అవకాశం ఉండదు. ఈ పని చేసినా ఈ ఏడాది డిసెంబర్ 31లోగా చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎన్నికల హడావుడి నెలకొననుంది, ఆ తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటు చేయడం దాదాపు అసాధ్యం. ఉత్తరాంధ్ర-సీమలో ఒకొక్కటి. ఈలోగా ఆ పని చేయాలన్నది కూటమి ప్రభుత్వం ఆలోచన. దీని ఆధారంగా చకచకా అడుగులు వేస్తోంది. తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్.. జనాభా, భౌగోళికంగా పెద్దది. ప్రస్తుతం 26 జిల్లాలు ఉన్నాయి. వీటిని 32 జిల్లాలుగా చేయాలని ప్లాన్ చేస్తోంది కూటమి సర్కార్. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త జిల్లాలపై సాధ్యాసాధ్యాలపై దృష్టి సారించింది. ఇప్పటికే వివిధ జిల్లాల ప్రజల నుంచి వినతులు స్వీకరించింది కేబినెట్ సబ్ కమిటీ. కొన్ని జిల్లాలు విస్తీర్ణ పరంగా పెద్దదిగా ఉన్నాయి. జిల్లా కేంద్రాలకు రాకపోకలకు సుదూరంగా ఉండడం దీనికి కారణమైంది. వాటిపై ఇప్పుడు చంద్రబాబు సర్కార్ ఫోకస్ చేసింది. న్యూఇయర్ లోపు కొత్తగా ఆరు జిల్లాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఉమ్మడి శ్రీకాకుళం నుంచి పలాస, ప్రకాశం నుంచి మార్కాపురం, చిత్తూరు జిల్లా మదనపల్లె, నెల్లూరు నుంచి గూడూరు, కడప నుంచి రాజంపేట, గుంటూరు నుంచి అమరావతి కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తోంది. దీనిపై కొన్నాళ్లు ప్రచారం సాగుతోంది కూడా. ఈ రెండు నెలల్లో మంత్రివర్గం ఉప సంఘం ఇచ్చే నివేదికను కేబినెట్‌లో పెట్టి చర్చించనుంది. ఈ రెండు నెలల్లో కొత్త జిల్లాల వ్యవహారానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని భావిస్తోంది. లేకుంటే మరో 15 నెలలు ఆగాల్సి వుంటుంది. ఈలోగా ఎన్నికలకు సమయం ముంచుకొస్తుంది. ఈ ఏడాది డిసెంబర్ మూడో వారానికి వాటిని పూర్తి చేయాలని ఆలోచన చేస్తోంది. వచ్చే ఏడాది జనవరి 26 నుంచి కొత్త జిల్లాలను అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు ప్రభుత్వం వర్గాలు చెబుతున్నారు.

# అప్రమత్తమైన విద్యుత్ శాఖ

**ఆలమూరు (కొత్తపేట), సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం మరింత తీవ్ర రూపం దాల్చి పెను తుఫాన్ గా మారనుంది. సోమవారం ఉదయం 9 గంటల నుండి వర్షాలు మొదలయ్యాయి. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైల ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించడంతో ఏపీఎస్ డిసిఎల్ ఉన్నతాధికారులు, ఏడిఈ శ్రీధర్ ఆదేశాల మేరకు ఆలమూరు మండలంలో ఎలక్ట్రికల్ ఏఈ ప్రసాద్, లైన్ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం, సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. విద్యుత్ తీగలపై ఉన్న కొమ్మలను ఇప్పటికే తొలగించారు. విద్యుత్ స్తంభాలతో పాటు క్రేన్లను కూడా అందుబాటులో ఉంచారు. విపరీతమైన గాలులు వీస్తున్నప్పుడు ఎవ్వరూ బయటకు రావొద్దు. చెట్లు కింద, కరెంటు స్తంభాలు వద్ద ఉండవద్దని, తడి చేతులతో స్విచ్లు వెయ్యవద్దని వారు హెచ్చరించారు. ఏ క్షణంలోనైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా సకాలంలో అందించనునట్లు వారు వెల్లడించారు. మీ మీ గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడితే వెంటనే సమీపంలో గల లైన్ మేన్ లకు సమాచారం అందించాలని అన్నారు. కొన్ని సమయాల్లో విద్యుత్కు అంతరాయం ఏర్పడవచ్చునని ముందుగా కొవ్వొత్తులు ఉంచుకోవాలని తెలిపారు.

#### దంచికొడుతున్న వర్షం

**కోనసీమ, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** మొంథా తుపాను ప్రభావంతో కోనసీమ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు మండలాల్లో ఈదురు గాలులు వీస్తున్నాయి. సాయంత్రం నుంచి గాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా అధికారులు ఆదేశించారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

## అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, సూర్యవాస్తవం, అక్టోబర్ 28:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో "మొంథా" తుఫాను కారణంగా నంద్యాల జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలెవరు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా సరాసరి సగటు వర్షపాతం మూడు సెంటీమీటర్లు నమోదయిందని కలెక్టర్ తెలిపారు. అత్యధికంగా రుద్రవరం మండలంలో 5 సెంటీమీటర్లు, నంద్యాల అర్బన్‌లో నాలుగు సెంటీమీటర్లు, సిరివెళ్ల, గోస్పాడు, శ్రీశైలం, నంద్యాల రూరల్, ఆళ్లగడ్డ, మహానంది, కోవెలకుంట్ల, చాగలమర్రి, ఆత్మకూరు మండలాల్లో మూడు సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయిందన్నారు. తుఫాను ప్రభావం కారణంగా వర్షాలు మరో 3 రోజులు కొనసాగే అవకాశం ఉందని, ప్రజలు భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలి అని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు.

**ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లొద్దు**

విద్యుత్ స్తంభాలు, తెగిన విద్యుత్ తీగలు, వాగులు, వంకలు, చెరువులు, కెనాల్లు వంటి ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లరాదన్నారు. మట్టిమిద్దెలలో నివాసం ఉండకుండా సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని కలెక్టర్ సూచించారు. పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించి పశుసంపదను కాపాడుకోవాలన్నారు. తుఫాను, వర్షం సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కలెక్టరేట్లోని కంట్రోల్ రూమ్ నెంబర్ 08514 - 293903 కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు.

## గుంటి మడుగులో తహసీల్దార్ పరిశీలన





**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** తుఫాను ప్రభావం ఎక్కువ అవుతుండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్ గుంటి మడుగులోని లోతట్టు ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. ప్రజలను హెచ్చరికలు జారీ చేశారు. పక్కనే ఉన్నటువంటి స్కూల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి వారికి కావాల్సినటువంటి సామాగ్రితోపాటు నిత్యావసర వస్తువులు, నీటి సౌకర్యము తదితరాలు సమకూర్చారు.

## తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** మొంథా తుఫాన్ కారణంగాకురుస్తున్న భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే పలువురు అధికారులు, నాయకులతో కలిసి నియోజకవర్గంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. తుఫాన్' ప్రభావంపై సమీక్ష నిర్వహించి, భారీ వర్షాల కారణంగా ప్రాణ నష్టం జరక్కుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దొరవారిసత్రం మండలంలోని తనయాలి వంతెనతోపాటు, సూళ్లూరుపేట మండలంలోని మంగళంపాడు, దొండ కాలువ ప్రాంతాలను పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, తుఫాన్ షెల్టర్లకు తరలించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట పలువురు అధికారులు,నాయకులు ఉన్నారు.



# గంజాయిని కూకటివేళ్లతో పెకలిస్తాం

### డీఎస్పీ మహేంద్ర - వరుసగా రెండో రోజు మరో ఇద్దరి అరెస్ట్ - రెండు కిలోల గంజాయి స్వాధీనం



**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** మదనపల్లె డివిజన్‌లో గంజాయిని కూకటి వేళ్లతో పెకిలిస్తామని, గంజాయి రహిత మదనపల్లె డివిజన్‌ను తయారు చేస్తామని డీఎస్పీ మహేంద్ర స్పష్టం చేశారు. గంజాయి విక్రేతలపై వరుస దాడులు చేపట్టిన పోలీసులు సోమవారం మదనపల్లె రెండవపట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిని అరెస్టు చూపగా మంగళవారం మదనపల్లె రూరల్ పోలీస్ స్టేషన్లో మరో ఇద్దరిని అరెస్టు చూపించారు. అరెస్టుకు సంబంధించి డిఎస్పి మహేంద్ర, సీఐ సత్యనారాయణలు మాట్లాడుతూ కురబలకోట మండలం, అంగళ్లు లో గంజాయి వాడకం ఎక్కువగా ఉండడంతో ఆ ప్రాంతంలో నిఘా పెట్టినట్లు తెలిపారు. కురబలకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఎస్సై దిలీప్ కుమార్ సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా మదనపల్లె పట్టణం మంజునాథ కాలనీకి చెందిన మూడే మణికంఠ నాయక్ (19) పోతబోలు గ్రామం, కురవపల్లి కి చెందిన మలకుంట్ల గోవిందు (67)లు ద్విచక్ర వాహనంలో వస్తూ పోలీసులను చూసి వెను తిరగడంతో అప్రమత్తమైన పోలీసులు పట్టుకోవడం జరిగిందన్నారు. వారి వద్ద తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయి పట్టుకున్నట్లు తెలిపారు. దీంతో ఆ ఇద్దరిని అరెస్ట్ చేసి విచారించగా శివశంకర్, ఆలీ, శివ, బన్ను, తేజ అనేవాళ్ల దగ్గర నుంచి గంజాయి కొనుగోలు చేసి 10, 20 గ్రాముల ప్యాకెట్లు తయారుచేసి ఇంజనీరింగ్ కళాశాలల వద్ద, బస్టాండ్ కూడలిలో విక్రయిస్తున్నట్లు అంగీకరించారన్నారు. దీంతో ఇద్దరిపై ఎన్డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, అరెస్ట్ అనంతరం, రిమాండ్ కు తరలించామని డిఎస్పి పేర్కొన్నారు. గంజాయి పై ఉక్కు పాదం మోపుతున్నామని, క్రమంగా తనిఖీలు చేపట్టి, విస్తృత దాడులు చేపట్టి గంజాయి సరఫరా చేస్తున్నా, విక్రయిస్తున్నా, వినియోగిస్తున్న వారిని పట్టుకుని పట్టుకుని అరెస్టు చేసి జైలుకు పంపుతామన్నారు. గం జాయి రహిత మదనపల్లె డివిజన్‌గా తయారు చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ చేపట్టామని, ప్రజలు సైతం పోలీసులకు సహకరించాలని కోరారు.

**గంజాయికి బానిస అవ్వద్దు ..**
**జీవితాలను నాశనం చేసుకోవద్దు**

గంజాయికి ఒకసారి అలవాటుపడితే జీవితం అంధకారమవుతుందని, కావున జీవితాలను నాశనం చేసుకోవద్దని డిఎస్పి హితువు పలికారు. ముఖ్యంగా ఇంట్లో తల్లిదండ్రులు తమ ప్రవర్తనను పర్యవేక్షించాలని, వారిలో ఏవైనా మార్పులు గమనిస్తే వెంటనే వారు చదువుతున్న కళాశాలలకు వెళ్లి విచారణ చేయాలన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఫలితం లేదని, కావున గంజాయికి అలవాటు పడిన వారిని మొగ్గలోనే తుంచేయాలని తెలిపారు. ఇటీవల మదనపల్లె పట్టణంలో 13 మంది యువత, విద్యార్థులు గంజాయి వినియోగిస్తున్న వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చమన్నారు. వారిలో పరిపూర్ణ మార్పు తీసుకొచ్చేందుకు చిత్తూరులోని డి అడిక్షన్ సెంటర్ కు తరలించమన్నారు. 30 రోజుల పాటు వారు ఆ సెంటర్లోనే ఉండి శిక్షణ తీసుకుని గంజాయి, మత్తు పదార్థాల కు దూరమయ్యేందుకు అవకాశం ఉందన్నారు. కావున తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పిల్లలను గమనిస్తూ ఎవరిలోనైనా ఇలాంటి అవ లక్షణాలున్నట్లు గుర్తించి, తమ దృష్టికి తెస్తే వారిని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలిస్తామని స్పష్టం చేశారు.

# నందలూరు ట్యాంక్‌ను పరిశీలించిన కలెక్టర్ నిశాంత్ కుమార్





**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** అన్నమయ్య జిల్లాలో "మొంథా" తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాజంపేట మండలం లోని నందలూరు ట్యాంక్‌ను (కన్యక చెరువు) జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, అడిషనల్ ఎస్పీ మనోజ్ కుమార్‌లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చెరువులు, వాగులు, కుంటలు మరియు ఇతర నీటి నిల్వ ప్రాంతాలలో నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రాజంపేట మండలం లోని నందలూరు ట్యాంక్ ( కన్యక చెరువు) నిండిన వెంటనే నీరు చెయ్యేరు నది లో చేరుతుందని తెలిపారు. ప్రజలు ఈ నీటి నిల్వ ప్రాంతాల సమీపానికి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామ స్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. అలాగే, లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను తక్షణమే సురక్షిత ప్రదేశాలకు తరలించి, నిర్దేశిత పునరావాస కేంద్రాలలో తగిన వసతి మరియు ఆహార సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గేవరకు పరిస్థితిని పర్యవేక్షిస్తూ, ప్రజల భద్రతకు సంబంధించిన చర్యలను అమలు చేయాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గారు ఆదేశించారు.

## 7నుంచి రాష్ట్ర రెవెన్యూ క్రీడలు

### సాంస్కృతిక కార్యక్రమాలకు రావాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఆహ్వానం





**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వరులు సూచనలతో నవంబర్ 7 నుండి 9 తేదీ వరకు ఆర్డిటీ వేదికగా రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక పోటీలకు హాజరు కావాలని మంగళవారం ఉదయం మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రవాణా, క్రీడా మరియు యువజన శాఖ మంత్రిని అన్నమయ్య జిల్లా పార్టీ కార్యాలయంలో కలిసి రాష్ట్ర కార్యవర్గం తరపున ఆహ్వానించినట్లు ఏపీఆర్ఎస్ఏ అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ పి.నరసింహ కుమార్,సెక్రటరీ, రామాంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించి, పూలబొకే అందజేశారు. ఎంతో ప్రతిష్టమకంగా జరిగే క్రీడా సంస్కృతిక కార్యక్రమాలకు తప్పకుండా హాజరు కావాలని వారిని కోరారు. వారి వెంట కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి




**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** రాయచోటి కలెక్టరేట్లో మంగళవారం ఉదయం విజిలెన్స్ అవగాహన వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు మాట్లాడుతూ తన సర్వీసులో ఏసీబీ కేసులో వల్ల పట్టుబడిన అధికారులు మరియు సిబ్బందిని స్వయంగా చూశానని వాళ్ళు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నూతనంగా విధులలో చేరుతున్న అధికారులు మరియు సిబ్బంది చట్టానికి లోబడి విధులు నిర్వహించాలని అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కడప రేంజ్ ఎసిబి ఇన్స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ అవినీతి రహిత సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా విజిలెన్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈనెల 27 నుండి నవంబర్ రెండవ తారీకు వరకు వారోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్మారకార్థం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఏర్పడిన తర్వాత రాష్ట్రాలలో అవినీతి నిరోధక కార్యాలయాలు ఏర్పాటు చేశారని ఈ కార్యాలయాలు అవినీతినిరోధక చట్టాన్ని అమలు చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. చట్టపరంగా వచ్చే ఆదాయం మినహా ఎటువంటి నగదు, బహుమతులు వంటివి తీసుకుంటే చట్టపరంగా లంచం తీసుకున్నట్లు అవుతుంది అన్నారు. ఈ చట్టం ప్రకారం 95% కేసులలో శిక్ష పడడం జరిగిందని అధికారుల స్థాయి నుండి నాలుగవ తరగతి స్థాయి ఉద్యోగుల వరకు అందరూ చట్టానికి లోబడి పని చేయాలన్నారు. ఏసీబీ కేసులో పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయని వాటన్నిటి నుండి బయటపడడానికి కనీసం 15 సంవత్సరాల పైన సమయం పడుతుందని కాబట్టి ఉద్యోగులందరూ జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. అవినీతి కేసులపై ఫిర్యాదు చేసేందుకు 1064, 9440446191 నెంబర్లను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# మానసిక వ్యాధిగ్రస్తులకు అండగా మనోబంధు






**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** మనోబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మానసిక రోగంతో బాధపడుతూ సంచారంగా తిరుగుతున్న రోగుల రక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు అనంతపురం జిల్లా మరియు ధర్మవరంలో మనోబంధు క్యాంప్ జరిగింది. ఈకార్యక్రమంలో ఐదుగురు మాన సిక వ్యాధిగ్రస్తులను కడప ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ రిమ్స్ హాస్పిటల్లో చేర్పించడమైనది. అనంతపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరులు మున్సిపల్ కమిషనర్ బాలస్వామి ఈ స్పెషల్ డ్రైవ్‌కు చేయూత నిచ్చారు. స్పెషల్ డ్రైవ్‌లో మునిసిపల్ పరిపాలన, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా పరిపాలన, హెూమ్ శాఖ మరియు పౌర ప్రజా సంఘాల సహకారంతో జరిగింది. అనంతపురం జిల్లాలో మనో బంధు అంబులెన్స్ విస్తృ తంగా తిరిగి ఐదుగురు వ్యాధిగ్రస్తులను ఆసుపత్రిలో చేర్పించారు. మానసిక వ్యాధిగ్రస్తుల ఆచూకీ జిల్లా బాధ్యులు బాయినేని నాగేంద్రప్రసాద్ 9440931839 లేదా ప్రాంతీయ సమన్వయకర్త డా.యం. సురేష్ బాబు 9989988912కు తెలుపవలసిందిగా కోరడమైనది. ప్రముఖ యూట్యూబ్ నిర్వాహకులు అబ్బా టీవీ డా.హరి ప్రసాద్, రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు డా.రామచంద్ర, బాయినేని నాగేంద్ర ప్రసాద్, రాష్ట్ర అకడమిక్ కోఆర్డినేటర్ డా.ముచ్చుకోట సురేష్ బాబు ఆంధ్రప్రదేశ్ ఒడ్ క్రాస్ సొసైటీతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు.

# ఉద్యాన పంటలపై అవగాహన



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** మొంథా తుఫాన్ ముందస్తు జాగ్రత్తలపై ఉద్యాన శాఖ జిల్లాస్థాయిలో జిల్లా ఉద్యాన అధికారిణి, మండల స్థాయిలో ఉద్యాన అధికారులు, గ్రామస్థాయిలో ఉద్యాన సహాయకులు అందరూ గత మూడు రోజులుగా క్షేత్రస్థాయిలో పంట పొలాలు పరిశీలించి ఆర్ఎస్కేల పరిధిలో గ్రామసభలు నిర్వహించి రైతులను అప్రమత్తం చేస్తున్నారు అన్నమయ్య జిల్లాలో ప్రస్తుతం టమాటో చివరి కోత దశలో 1340 హెక్టార్లలో, శాఖీయ దశలో 3250 హెక్టార్లు, పూలతోటలు 200 హెక్టార్లు, ఇతర కూరగాయ పంటలు 642 హెక్టార్లు, అరటి 7133 హెక్టార్లు, బొప్పాయి 900 హెక్టార్లలో సాగులో ఉన్నాయి. కావున ప్రతి ఒక్క ఉద్యాన రైతు కూడా ముందస్తు చర్యలైన మురుగు కాలువలు ఏర్పాటు, ఊత కర్రల ఏర్పాట, పక్వానికి తయారైన కాయలు, పూలను మార్కెటింగ్ చేసుకోవడం, పంటలకు నీటి తడుల ఆపుదలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. అలాగే వర్షాలు ఆగిన వెంటనే పంటను బట్టి రైతు చేపట్టవలసిన జాగ్రత్తలపై కూడా కింది విధంగా తెలియజేశారు. అరటిలో సాళ్లలో నీరు నిల్వ ఉండటం వలన మొదలు కుళ్ళు అవకాశాలు ఎక్కువ కాబట్టి నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లీటరుకు లేదా రెడో మిల్ గోల్డ్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి మొదలు తడిచే విధంగా చెట్లకు పోయాలి. గాలిలో తేమశాతం అధికంగా ఉండటం వలన ముదురు తోటలలో సిగతోక ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉన్నందువలన దాని నివారణకు ప్రోఫికోనోజోల్ 1 ml లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అలాగే నేల ఆరిన తరువాత సాళ్లలో అంతర సేద్యం చేయించి ఒక్కో చెట్టుకి 100 గ్రాముల యూరియా మరియు 80 గ్రాముల పొటాషియం 20 రోజుల వ్యవధిలో రెండుసార్లు వేయాలి.

అలాగే భూమిలో తేమ ఎక్కువగా ఉండటం వలన వేరు వేవస్థ ద్వారా ఆహార సరఫరా జరగకపోవచ్చు కావున ఆకులు బాగా తడిచే విధంగా 0:0:52 ను 5 గ్రాములు మరియు 13: 0: 45 ను 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. బొప్పాయిలో మొదలు కుళ్లు నివారణకు రెడోమిల్ గోల్డ్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి మొదలు తడిచే విధంగా పోయాలి. అలాగే బొప్పాయిలో సూక్ష్మ పోషకాల లోపం అధికంగా కనబడుతుంది కావున సూక్ష్మ పోషకాలు 5 గ్రాములు మరియు బోరాన్ 1 గ్రాము మరియు 13:0:45, 5 గ్రాములు లీటర్ నేటికీ కలిపి ఆకులు తడిచే విధంగా పిచికారి చేయాలి. సిఫార్సు చేసిన ఎరువుల కన్నా 10 నుంచి 15% అధిక మోతాదులో సాళ్లలో అంతర సేద్యం చేసిన తర్వాత ఎరువులని వెయ్యాలి. కూరగాయ పంటలలో వర్షాలు ఆగిన వెంటనే 19: 19 : 19 ఏ 5 గ్రాములు లేదా 13:0:45 ఏ 5 గ్రాములు మరియు సూక్ష్మ పోషకాలు 5 గ్రాములు లీటర్ నీట్ కి కలిపి పిచికారి చేసుకోవాలి. మొదలు కుళ్లు రోగం నివారణకు COC 3 గ్రాములు లేదా మెటలక్సల్ మాంకజబ్ ఏ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి చెట్టు మొదలలో పోయాలి. ఆకుమచ్చ తెగులు మరియు కాయలపై గజ్జి తెగులు నివారణకు ఎక్కువగా సోకే అవకాశాలు ఉన్నాయి కాబట్టి వాటి నివారణకు అమిస్తార్ టాప్ 1 ml లేదా కవచ్ 2 గ్రాములు లేదా కవాచ్ ఫ్లో 2 ml లేదా ఆక్రోబెట్ కంప్లీట్ 2 గ్రాములు లీటర్ నేటికీ మరియు స్టెప్టోమైసిన్ 0.5 గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. గాలిలో తేమ శాతం అధికంగా ఉండుటవలన బూజు తెగులు వచ్చే అవకాశం ఉన్నది కాబట్టి నివారణకు ఫైలిన్ 1.2 గ్రాములు లేదా కస్టోడియ 2 ml లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి అని తెలియజేశారు.







# రైతులకు లబ్ధి చేకూరేలా కృషి చేయాలి

## పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి సిద్ధార్థ జైన్



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** జిల్లాలో నూతన వ్యూహాలు, ఆచరణాత్మక కార్యాచరణతో రైతులకు లబ్ధి చేకూరేలా ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం అమలుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ కోపరేషన్, పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి సిద్ధార్థజైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో... జిల్లాలో ప్రధాన మంత్రి ధన ధ్యాన్య యోజన పథకం అమలుపై జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో.. వివిధ శాఖల జిల్లా అధికారులతో కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ కోపరేషన్ మరియు పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి సిద్ధార్థ జైన్ సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ కోపరేషన్ మరియు పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి మాట్లాడుతూ.. నూతన ఆలోచనలు, విధానాలతో ఆయా శాఖల ద్వారా అమలవుతున్న పథకాలను మరింత మెరుగైన ఫలితాలు అందించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకు క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన పథకం ద్వారా రైతులకు లబ్ధి చేకూర్చే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవడం అధికారులపై ఆధారపడి ఉందన్నారు. జిల్లాలో ఉన్న రెవిన్యూ గ్రామాలు ఉంటే.. ప్రతి నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో ఎలాంటి పరిస్థితి ఉంది, దానికి అనుగుణంగా అవుట్ కమ్ వ్యూహం, లక్ష్యం నిర్దేశం, సాధనకు తగిన స్పష్టత ఉండాలన్నారు. ఉత్పత్తి పెరిగినప్పుడు వినియోగం ఎక్కడ ఎక్కువగా ఉంది, నిల్వ సదుపాయాలు, మార్కెటింగ్ అంశం, ఏ రేటుకు అమ్ముతారన్న అంశాలను గుర్తించాలన్నారు. ముఖ్యంగా ఇప్పుడున్న వాటితోపాటు మొక్కజొన్న, చింతపండు, దానిమ్మ ప్రాసెసింగ్ యూనిట్లను తీసుకురావడానికి అధికారులు కృషి చేయాలన్నారు. మొక్కజొన్నను ఇత్తనాలు పౌల్ట్రీ రంగానికి వాటిని ఏ విధంగా టైప్ ఆఫ్ చేయాలో ఆలోచించాలన్నారు. పాలు, మొక్కజొన్న, చిరుధాన్యాల మార్కెట్ ధరలను ఈ విధంగా పెంచగలుగుతారని ఆలోచించాలని, అలాగే ఇప్పుడు వస్తున్న పంట ఏ రేటుకు పోతోందని కూడా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. పరిశ్రమల రంగంలో ఎన్నో ఇన్సెంటివ్‌లు ఉన్నాయని, వాటిని ఎలా వినియోగించుకోవాలో కూడా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. నాబార్డుద్వారా కూడా అనేక పథకాలు అమలవుతున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఎం మత్స్య సంపద యోజన కింద చేపల ఉత్పత్తి పెంచడానికి కృషి చేయాలని, సహకార రంగం, నాబార్డు, వ్యవసాయ అనుబంధ శాఖలు సమన్వయంగా కలిసి పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు, సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పీఎం ధన ధాన్య కృషి యోజన పథకం అమలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లా ఎంపిక కావడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో అమలు పరచడం ద్వారా పథకం యొక్క లక్ష్యాల సాధనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, ఉద్యానం, పశుసంవర్ధకం, పట్టు పరిశ్రమ, మత్స్య, మైనర్ ఇరిగేషన్, పరిశ్రమలు, డ్వామా, డి ఆర్ డి ఏ, స్కిల్ డెవలప్మెంట్ శాఖలను సమన్వయం పరచడం ద్వారా పీఎం డిడి కేవై పథకం అమలుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 37% మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని.. జిల్లా జిడిపి కూడా కంట్రిబ్యూట్ చేస్తుందని, ప్రైమరీ సెక్టార్ లో కూడా వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధకం 33% ఉందన్నారు. ఈ సందర్భంగా పిపిటి ద్వారా వివిధ అంశాలను వివరించారు, ఈ సమావేశంలో జేసి మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రాము నాయక్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, ఏపిఎంఐపి అధికారి సుదర్శన్, డ్వామా పిడి శోభారాణి, ఇరిగేషన్ అధికారి గురుమూర్తి, ఇండస్ట్రీస్ అధికారి నాగరాజు, నాబార్డు అధికారి అనురాధ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వాడకంతో జీవితాలు నాశనం



**పామిడి, సూర్యవాస్తవం, అక్టోబర్ 28:** పామిడి జూనియర్ కాలేజీలో లో ఆర్ కె రవి కృష్ణ, ఐపీఎస్ ఆదేశాల మేరకు, మరియు జిల్లా ఎస్పీ. పి. జగదీష్, సూచనలతో, అనంతపురం జిల్లా పామిడి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పామిడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యుగేందర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "డ్రగ్స్ వాడకం మన జీవితాన్ని నాశనం చేస్తుంది. ప్రతి విద్యార్థి బాధ్యతగా ఉండి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి" అని సూచించారు.తదనంతరం ఈగల్ సెల్ అనంతపురం ఇన్‌చార్జ్ సబ్ ఇన్‌స్పెక్టర్ హనుమంతు గారు విద్యార్థులకు డ్రగ్స్ రకాల గురించి వివరించి, వాటి వాడకం వల్ల కలిగే మానసిక, శారీరక మరియు సామాజిక నష్టాలు గురించి వివరించారు. అలాగే ఎన్ డి పి ఎస్ చట్టం కింద డ్రగ్స్ వినియోగం, నిల్వ, రవాణా, విక్రయం వంటి కార్యకలాపాలకు కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు.

## తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- **నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక**



**నాయుడుపేట, సూర్యవాస్తవం, అక్టోబర్ 28:** మొంథా తుఫాన్ నేపథ్యంలో కురుస్తున్న భారీ వర్షాలకు నాయుడుపేట పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదేశాల మేరకు నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక ఒక ప్రకటనలో తెలియజేశారు. తుఫాన్ ప్రభావంతో మంగళ, బుధ వారాలలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇంటి నుండి బయటకు వెళ్ళవద్దని సూచించారు. భారీ వర్షాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే సంబంధిత అధికారులకు కమిషనర్‌కి సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ముఖ్యంగా స్వర్ణముఖి నది తీరాన ఉన్న ప్రజలు కాలనీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## చెరువు తెగకుండా చూసుకోవాలి

- **వైసీపీ నేత నిసార్ అహ్మద్**



**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** మొంథా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులపాటు ఏకధాటిగా వర్షాలు పడుతుండడంతో మదనపల్లె నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిసార్ అహ్మద్ మంగళవారం మండలంలోని పలు చెరువులను పరిశీలించారు. చికలబైలు సమీపంలోని కదిరమ్మ చెరువు, లచ్చారెడ్డి చెరువు, వెంకటమ్మ చెరువు, ఓబులనాయుని చెరువులను పరిశీలించి గ్రామస్థులతో కలిసి మాట్లాడారు. అనంతరం అధికారులను పిలిపించి చెరువు కట్టలు బలంగా ఉండేలా చూసుకోవాలని, ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మత్తులు చేయాలని తెలిపారు. గండిపడిన, చిన్నపాటి కొంగుబాటులోనైనా వెంటనే గుర్తించి చెరువులు తెగిపోకుండా కట్టలను పటిష్టం చేయాలని సూచిం చారు. చెరువులు నిండుగా ఉండడంతో ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వానతీవ్రత పెరిగితే చెరువులో నీటిని మొరవల ద్వారా తరలించాలని, ప్రమాదం జరిగే అవకాశాలను ముందుగా పసిగట్టి, ప్రజలను అప్రమత్తం చేసి, సురక్షిత ప్రాంతాలకు తరలించే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విపత్కర పరిస్థితులలో వైసీపి శ్రేణులు అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ప్రసాద్ బాబు, నాగిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మునిశేఖర్, నరసింహులు, కొత్తపల్లి మహేష్, చిప్పిలి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణముఖి నదిని పరిశీలించిన కమిషనర్ ఫజులుల్లా



**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** బంగాళాఖాతంలో ఏర్పడ్డ ముంధ్గా తుఫాన్ నేపథ్యంలో మంగళవారం తిరుపతి జిల్లా నాయుడుపేట పురపాలక సంఘ పరిధిలోని స్వర్ణముఖి నది నీటి ప్రవాహాన్ని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా పరిశీలించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణముఖి నదిని పరిశీలించి చుట్టుపక్క ప్రజల్ని అప్రమత్తంగా ఉండాలని ప్రజల సహాయార్థం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన(08623 248084) నంబర్ కు ఫోన్ చేసి వెంటనే సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేయడం జరిగింది..అంతేకాకుండా అత్యవసరమైతే తప్ప మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పట్టణ ప్రజలు ఎవ్వరు ఇళ్ల నుండి బయటకు రావద్దని కమీషనర్ ఫజులుల్లా ప్రజలను కోరారు.

## రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



**గోరంట్ల, సూర్య వాస్తవం అక్టోబర్ 28:** తుఫానులో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు బృందం సూచించారు, వ్యవసాయ పరిశోధనా స్థానం కదిరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం శ్రీనివాస చారి మరియు శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ రమేష్ నాయక్ ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కే రామసుబ్బయ్య వ్యవసాయ సహాయ సంచాలకులు జి కృష్ణయ్య మండల వ్యవసాయ అధికారులు గోరంట్ల, చిలమతూరు మండలాలు వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు వ్యవసాయ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ప్రస్తుతము తుఫాను కారణంగా వివిధ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు తెలియ జేశారు,ముఖ్యంగా అధిక వర్షాలకు పొలంలో నీళ్లు నిలిచినట్లయితే బయటకు తీసివేయవలెను 24 గంటలు కంది పంట నీళ్లు నిలబడటం అట్లయితే కంది చనిపోవడం జరుగు తుందన్నారు, కావున దీని నివారణకు వెంటనే నీటిని తీసివేయవలెను అధిక తేమ ఉన్నప్పుడు పోషకాలు లభ్యం కాక మొక్క ఎదుగుదల క్షీణించును కావున పైపాటుగా ఎరువులు వేయవలెను అంతేకాకుండా పైపాటుగా పొటాషియం నైట్రేట్ ఐదు గ్రాములు లీటర్ ఇంటికి లేదా మూడు పంతొమ్మిదిలో ఐదు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయవలెను వంట కోత దశకు వచ్చినప్పుడు వర్షాలు ఆగిపోయేంతవరకు ఎటువంటి పరిస్థితుల్లోన కోయరాదు కంది పంట ప్రస్తుతం మొగ్గ దశలో వేప నూనె 5 మిల్లీమీటర్లు కలిపి పిచికారి చేయవలెను పూత సమయంలో క్లోరోపైర్ఫాస్ 2.5 మిల్లీ మీటర్ల నీటి కలిపి పిచికారి చేయవలెను మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఇమామెట్టిన్ బెంజేట్ పాయింట్ త్రీ గ్రామ్స్ లెటర్ నీటి కల్పి పిచికారి చేయవలెనన్నారు,ఈ కార్యక్రమంలో రైతులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు



**పెళ్లకూరు, సూర్యా వాస్తవం, అక్టోబర్ 28:** బంగాళాఖాతంలో ఏర్పడ్డ మొంథా తుఫాన్ ప్రభావంతో తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా ఇరిగేషన్ శాఖ డీఈఈ విశ్వనాథం, జేఈ శ్రీనివాసులు మంగళవారం రావులపాడు పంచాయతీ పరిధిలోని రావులపాడు, టెంకాయతోపు, భీమవరం గ్రామాల్లో పర్యటించారు. వరద నీరు చేరే లోతట్టు ప్రాంతాలు, చెరువులు, వాగులను పరిశీలించి పరిస్థితులను అంచనా వేశారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుండి బయటకు రావద్దని వారు సూచించారు. పర్యటనలో చిల్లకూరు పీఎస్ఎస్ చైర్మన్ కె.వి. నాయుడు పాల్గొన్నారు.

## ధర్మపురంలో రచ్చబండ



**గుత్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మో హన్ రెడ్డి పిలుపు మేరకు గుంతకల్ నియోజక వర్గం మాజీ శాసనసభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స మ న్వ యకర్త వై వెంకటరామ రెడ్డి ఆదేశాల మేరకు గుత్తి మండలం ధర్మపురం గ్రామం నందు గ్రామం వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు అధ్యక్షతన జరిగిన రచ్చబండ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా గుంతకల్ నియోజకవర్గం యువ నాయకులు మంజునాథ్ రెడ్డికి గజమాలతో సన్మానించిన ధర్మపురం గ్రామ వైయస్సార్సీపీ నాయకులు అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన టువంటి రచ్చబండ కార్యక్రమంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంతక ల్ నియోజకవర్గం యువ నాయ కులు మంజునాథ్ రెడ్డి మాట్లాడు తూ మెడికల్ కాలేజీల ప్రైవేటీక రణను వ్యతిరేకిస్తూ కోటి సంతకా ల సేకరణకు శ్రీకారం చుట్టడం జ రిగిందని ఈ యొక్క కార్యక్రమం లో ప్రతి ఒక్కరూ పాల్గొని మెడిక ల్ కాలేజీల ప్రైవేటీకరణ గురించి ప్రజలలో చైతన్యం తెచ్చే విధంగా తీసుకువెళ్లాలని ప్రతి నియోజక వర్గంలో 50 నుండి 60 వేల వర కు సంతకాలు సే కరించాలని అ నంతరం రాష్ట్రంలో కోటి సంతకా లు పూర్తయిన అనంతరం మన రా ష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డితో పాటు పార్లమెంట్ సభ్యులు,శాసనస భ్యులు,నియోజకవర్గం సమన్వ యకర్తలతో కలిసి గవర్నర్ కి స మర్పించడం జరుగుతుందని తె లియజేశారు ఈ యొక్క కార్యక్ర మం లో గుత్తి,మండల,పట్టణ అ ధ్యక్షులు మధుసూదన్ రెడ్డి గంగ రాజు షఫీ బాచుపల్లి సర్పంచ్ ర మేష్ వైస్సార్సీపీ ధర్మపురం స ర్పంచ్ మాక్కేలా చంద్ర,ఉపసర్పం చ్ టీ.రంగ స్వామినాయకులు,రా జేంద్ర ప్రసాద్,సూరి,వెంకటేష్,గు ర్రాల రామాంజినేయులు,రంగ స్వామి,మనోహర్,డి.రంగస్వా మి,రమేష్,వైస్సార్సీపీ నాయకు లు తదితరులు నాయకులు కా ర్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

### అట్రాసిటీ కేసులు సత్వరం పరిష్కరించాలి - ఏపీ శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల







**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** ఎస్సీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని.. ఎస్సీల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల స్పష్టం చేశారు. మంగళవారం పుట్టపర్తి కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో.. షెడ్యుల్డ్ కులాల సంక్షేమము కొరకు ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, జేసీ మౌర్య భరద్వాజ్, స్థానిక శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి లతో కలిసి ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల పాల్గొనగా.. కమిటీ సభ్యులు కావలి గ్రీష్మ ప్రసాద్, ఎమ్మెస్ రాజు, విజయ్ చంద్ర బి.ఎన్, రోషన్ కుమార్ సొంగ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లాకు విచ్చేసిన శాసనసభ ఎస్సీ కమిటీ అధ్యక్షులు సభ్యులకు కలెక్టర్ ఎస్పి, జేసి, స్థానిక ఎమ్మెల్యే పూల మొక్కలు పుష్పగుచ్చాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. సమావేశం ప్రారంభం ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, జేసి, ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే పుట్టపర్తి జిల్లాలో పర్యటించి షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు మరియు షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు మరియు కార్యకర్తలు ఇచ్చే వినతి పత్రాలు స్వీకరించడం జరిగిందని, వాటిని మినిట్స్ రూపంలో రికార్డ్ చేసి శాసనసభకు అందజేస్తామన్నారు. సంక్షేమ పథకాల అమలు, పెండింగ్లో ఉన్న అట్రాసిటీ కేసుల స్థితి, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ స్థితి తదితర అంశాలపై నివేదికలను అందించడం జరుగుతుందన్నారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై ప్రజలు కోటి ఆశలతో ఉన్నారని వాటన్నిటినీ నెరవేర్చాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉందన్నారు. ఎస్సీల అభివృద్ధి కోసం 20వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించడం జరిగిందని, వారి కోసం ఎస్సీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. ఈ సబ్ ప్లాన్ నిధులనుంచి ఎన్ఆర్ఈజీఎస్ అనుసంధానంతో స్మశాన వాటిక లకు అప్రోచ్ రోడ్లు, ప్రహరీ, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు పునరావాసం కల్పించడం, ఆర్థికంగా ఆదుకోవడం లాంటి చర్యలను సీరియస్ గా తీసుకోవాలని, తీవ్రత ఎక్కువ ఉన్న కేసులకు సంబంధించి వారి కుటుంబాలకు భూమిని నిబంధనల మేరకు కేటాయించడం, ఇవ్వడం చేయాలని ఆదేశించారు. నూతనంగా ఎస్సీ హాస్టల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని, మరింత మంది ఎస్సీ విద్యార్థులు హాస్టల్స్ లోకి వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల శాఖ ద్వారా చిన్న యూనిట్ల స్థాపన కొరకు రూ 1500 కోట్ల ఇన్సెంటివ్స్ ను ప్రభుత్వం కేటాయించిందని, ఇందులో జిల్లాకు అత్యధికంగా రూ.184 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో ఎస్సీ ఎస్టీలకు 40% మేర ఖర్చు చేయాల్సి ఉందని, వీటి ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎస్సీలను ప్రోత్సహించాలన్నారు. విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని, దీని ద్వారా వారు క్షేత్రస్థాయిలో పర్యటించి గౌరవ ప్రదంగా సమస్యలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్సీలకు సంబంధించి ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఆర్థిక సహాయం, భూమిని ఎంత మందికి ఇచ్చారు, ఆయా శాఖల్లో పరిధిలో కారుణ్య నియామకాల్లో రోస్టర్ పాయింట్లు పాటించడం, తదితర అంశాలపై కూడా సమీక్షించడం జరిగింది. జిల్లాలో ఎస్సీల అభివృద్ధి కోసం బాగా పనిచేస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేకంగా అభినందించారు, ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మరియు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ... చాలా గ్రామాలలో ఎస్సీలకు స్మశాన వాటికలు లేవు. ఇది ఆత్మ గౌరవానికి సంబంధించిన విషయం. మడకశిర నియోజకవర్గంలో ఒక స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, మోడల్ గా ఉండే విధంగా వచ్చే నెలలో ఒకేరోజు వంద స్మశాన ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. షెడ్యూల్డ్ కులాల వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన అట్రాసిటీ చట్టం లక్ష్యం నెరవేరేలా పోలీసులు పనిచేయాలని, ఎలాంటి ఒత్తిడికి తలొగ్గరాదని, తప్పుడు కేసులు నమోదు కాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అట్రాసిటీ కేసు తీవ్రతను బట్టి బాధితులకు ఆర్థిక సహాయం, స్థలం ఇవ్వాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు ప్రతినెల నిర్వహించే సివిల్ రైట్స్ డేలో పాల్గొనాలని, డివిజన్, మండల పరిధిలో అధికారులు క్రమం తప్పకుండా నిర్వహించాలని, అందరూ అధికారులు కూడా ఇందులో పాల్గొనేలా చూడాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 2019 - 24 మధ్యలో దుర్వినియోగం అయ్యాయని, నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని, సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించాలని, ఎస్సీ కాలనీలలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎస్సీ హాస్టల్స్ లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఇళ్లు లేని దళితులు ఉండరాదనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని, అందుకు అనుగుణంగా జిల్లాలోని ఎస్సీ కాలనీలలో సచివాలయ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఇల్లు కావాలా, స్థలం, పట్టా కావాలా అని అడగాలని సూచించారు. మూడు నెలల తర్వాత శాసనసభ కమిటీ ఇక్కడికి మళ్లీ రావడం జరుగుతుందని, ఆలోపు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో బాగా పనిచేస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు ప్రశంసలు తెలిపారు, సమావేశంలో కమిటీ సభ్యులు కావలి గ్రీష్మ ప్రసాద్ మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో అట్రాసిటీ కేసులు పూర్తిగా నివారించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజలు సమస్యను చెప్పుకోవడం లేదా, అర్జీలు తీసుకోవడం లేదా అనేది పరిశీలించాలన్నారు. డ్రగ్స్, గంజాయి ఉపయోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఎస్సీ కాలనీలలోని యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో కమిటీ సభ్యులు విజయ్ చంద్ర బి.ఎన్ మాట్లాడుతూ.. కొందరు షెడ్యూల్డ్ కులాల ప్రజలు తమ దాకా కొన్ని సమస్యలు తీసుకువస్తారని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎస్సీ జనాభా ఎక్కువగా చోట, వారికి స్మశానవాటికలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీలకు పీఎం అజయ్, డిజిలక్ష్మి, తదితర పథకాల కింద లబ్ధి చేకూర్చాలన్నారు, సమావేశం ప్రారంభంలో జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ... జిల్లాలో ఎస్సీల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా శాఖల పరిధిలో షెడ్యూల్డ్ కులాలకు సంక్షేమ పథకాల కింద లబ్ధి చేకూర్చేందుకు, అట్రాసిటీ కేసుల కింద బాధితులకు ఆర్థిక సహాయం చేసేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. కమిటీ సూచనల మేరకు క్షేత్ర స్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డే లో ఎస్పీతో కలిసి పాల్గొంటామన్నారు. ఈ సందర్భంగా పిపిటి ద్వారా ఎస్సీల సంక్షేమానికి జిల్లాలో తీసుకుంటున్న చర్యలను కమిటీ సభ్యులకు వివరించారు. దీనిపై కమిటీ అధ్యక్షులు మరియు సభ్యులు స్పందిస్తూ... నివేదికలో అన్ని అంశాలు పొందుపరచడంపై కలెక్టరును ప్రత్యేకంగా అభినందించారు,జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ మాట్లాడుతూ... అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు న్యాయం జరిగేలా అన్ని చర్యలు చేపడతామన్నారు. ఇందుకు డివిజన్ వారీగా ఎస్సీల అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డే లో తాము పాల్గొంటున్నా మని తెలిపారు,సోషల్ వెల్ఫేర్ జెడి రెడ్డి బాలాజీ సాంఘిక సంక్షేమ శాఖలో అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఎస్సీ సబ్ ప్లాన్ గురించి పూర్తిస్థాయిలో వివరించారు. పలువురు జిల్లా అధికారులు వారి శాఖ నుండి ఎస్సీల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు రోస్టర్ అంశాలు కమిటీకి వివరించారు. అనంతరం శాసనసభ కమిటీ అధ్యక్షులు, సభ్యులను, జిల్లా కలెక్టర్, ఎస్పీ, సోషల్ వెల్ఫేర్ జెడిలు శాలువా కప్పి సముచితంగా సన్మానించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీలను శాసనసభ కమిటీ అధ్యక్షులు, సభ్యులు సన్మానించారూ,ఈ సమావేశంలో డిఆర్ఓ సుదర్శన్ రెడ్డి, ఆర్డీవోలు, డీఎస్పీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దాం

### ఏడీ వీరకుమార్ రెడ్డి

**పామిడి, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** డ్రగ్స్ అనేది మనిషి మారణ హోమగుండం లాంటిదని, వాటిని రూపుమాపి డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్ది ప్రజలను కాపాడుదాంఅని డ్రగ్స్ ఏడి వీర కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన మెడికల్ షాపుల యజమానుల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి నల్లమందు లాంటివి తగ్గుముఖం పట్టాయని, నూతనంగా లిక్విడ్ స్పిరిట్ రూపంలో డ్రగ్స్ మాఫియా దందా సాగుతోందన్నారు. వీటి అమ్మకాలు మెడికల్ షాప్ ల యందు సులభతరంగా విక్రయించబడుతున్నట్లు మాకు సమాచారాలు అందుచున్నాయి. డ్రగ్స్ వాడకం విక్రయించడం ఎన్ డి పి ఎస్ చట్టం కింద ఉండే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకొనబడునని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని లేకుంటే జీవితాలు బుగ్గిపాలు చేసుకోకండని,మెడికల్ షాపుల యజమానులకు అవగాహనలతో కూడిన హెచ్చరికలు కౌన్సిలింగ్ నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో డ్రగ్స్ ఏడి వీర కుమార్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు అశోక్ రెడ్డి, మాధవి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ జైపాల్ రెడ్డి, సీఐ యుగంధర్ రెడ్డి, ఈగల్ ఎస్సై హనుమంతు, పోలీస్ సిబ్బంది,పట్టణంలోని మెడికల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.







## పాఠశాలల్లో ఆధార్ అప్డేషన్ సేవలు

**గుత్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** గుత్తి పట్టణంలో జిల్లా బాలికల ఉన్నత పాఠశాల యందు ఆధార్ అప్డేషన్ నిర్వహణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ బి.జబ్బార్ వివరాలు వెల్లడిస్తూ ఈనెల 23వ తేదీ నుండి 30వ తేదీ వరకు పాఠశాలల యందు ప్రత్యేక ఆధార్ కేంద్ర సేవలను అందిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

## మంచి కంటెంట్‌తో 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్‌షో'



తిరువీర్, టీనా శ్రావ్య జంటగా నటించిన చిత్రం 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'. బై 7పీఎం, పప్పెట్ షో ప్రొడక్షన్స్ బ్యానర్లపై సంయుక్తంగా సందీప్ అగరం, అశ్మితా రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కల్పనా రావు సహ నిర్మాత. నవంబర్ 7న ఈ మూవీని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. మంగళవారం చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకులు కరుణ కుమార్, యదు వంశీ, ఆదిత్య హాసన్, రామ్ అబ్బరాజు, సన్నీ, దుశ్యంత్, ఉదయ్ గుర్రాల, రూపక్, తేజ, నంద కిషోర్ వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. హీరో తిరువీర్ మాట్లాడుతూ, 'నిర్మాత సందీప్ మాకు ఎంతో సపోర్ట్ చేశారు. ఈ కథ చెప్పినప్పుడు కంటిన్యూగా నవ్వుతూనే ఉన్నాను. మంచి కంటెంట్‌తో మా సినిమా రాబోతోంది. ఇది అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు. 'మా హీరో తిరువీర్ ఈ ప్రయాణంలో ఎంతో సపోర్ట్‌గా నిలిచారు. దర్శకుడు రాహుల్ ఈ మూవీని అద్భుతంగా తీశారు' అని నిర్మాత సందీప్ అగరం చెప్పారు. దర్శకుడు రాహుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, 'ఈ సినిమాకి ఆన్ స్క్రీన్, ఆఫ్ స్క్రీన్‌లో హీరో తిరువీర్. మా ట్రైలర్ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. ట్రైలర్‌కు వంద రెట్లు అనేట్టుగా సినిమా ఉంటుంది. అందరినీ ఎంటర్టైన్ చేసేలా మా చిత్రం ఉంటుంది' అని అన్నారు. 'మంచి కంటెంట్ ఉన్న చిత్రాల్ని ఆడియెన్స్ ఎప్పుడూ సపోర్ట్ చేస్తారు. మేం ఎంతో ఇష్టపడి, కష్టపడి ఈ మూవీని చేశాం. మంచి కంటెంట్‌తో మంచి ఎంటర్టైన్మెంట్ ఇచ్చేలా మా చిత్రం ఉంటుంది' అని హీరోయిన్ టీనా శ్రావ్య అన్నారు. మాస్టర్ రోహన్, సురేష్ బొబ్బిలి, నటి యామిని, నటుడు నరేంద్ర తదితరులు ఈ వేడుకలో పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

## ఉగాది కానుకగా 'డకాయిట్' రిలీజ్

అడివి శేష్ నటిస్తున్న చిత్రం 'డకాయిట్'. ప్రేమ-ప్రతీకార కథనం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. మేకర్స్ తాజాగా రిలీజ్ డేట్ అప్డేట్ ఇచ్చారు. 2026 ఉగాది కానుకగా మార్చి 19న ఈ సినిమా విడుదల కానుంది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ఇంటెన్స్ లుక్స్‌లో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫైర్ గ్లింప్స్ ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో ఆకట్టుకుంది. నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేసింది. విజువల్‌గా ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న తొలి తెలుగు చిత్రం ఇదే కావడం విశేషం. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ భారీ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తుండగా, సునీల్ నారంగ్ సహ నిర్మాత. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు.



## 3వ పాటగా 'చిన్ని గుండెలో..'



రామ్ పోతినేని నటిస్తున్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూక'. మహేష్ బాబు పి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 28న గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, టీజర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ 'నువ్వుంటే చాలే' ద్వారా రామ్ తన సింగింగ్ డెబ్యూ చేస్తూ, అందరినీ ఆకట్టుకున్నారు. రెండవ పాట 'పప్పీ షేమ్' డిఫరెంట్‌వైబ్‌తో అలరించింది. ఈ సాంగ్‌కి రామ్ స్వయంగా వాయిస్ ఇచ్చారు. సోమవారం మేకర్స్ థర్డ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. 'చిన్ని గుండెలో..' సాంగ్‌ని ఈనెల 31న రిలీజ్ చేయనున్నారు. ఉపేంద్ర ఈ చిత్రంలో సూపర్ స్టార్‌గా కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ ముఖ్యమైన పాత్రల్లో కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి కథ స్క్రీన్ ప్లే దర్శకత్వం: మహేష్ బాబు పి, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, సమర్పణ: గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ టీ-సిరీస్ ఫిలిమ్స్, సిఈఓ: చెర్రీ, సంగీతం: వివేక్, మెర్విన్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని, ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల.



# ఇక పొట్టి పోరు



కాన్‌బెర్రా: భారత్, ఆస్ట్రేలియా వన్డే సవాల్ ముగిసింది. 2027 ఐసీసీ వరల్డ్‌కప్ ప్రణాళికల్లో కొత్త ప్రయోగాలకు మినహా ఈ సిరీస్ ఇరు జట్లలో ఉత్సాహం నింపలేకపోయింది. 2026 ఐసీసీ టీ20 ప్రపంచకప్ నేపథ్యంలో నేటి నుంచి ఆరంభం కానున్న పొట్టి సవాల్‌ను భారత్, ఆస్ట్రేలియా సీరియస్‌గా తీసుకుంటున్నాయి. 2022, 2024లో ఆస్ట్రేలియా టీ20 ప్రపంచకప్‌లో విఫలమైంది. దీంతో కంగారూలు వచ్చే ఏడాది కోసం కొత్త ప్రణాళికలు సిద్ధం చేశారు. వరల్డ్ నం.1, డిఫెండింగ్ చాంపియన్ టీమ్ ఇండియాతో సిరీస్‌లో ఆసీస్ ఈ ప్రణాళికలను ఆచరణలోకి తీసుకురానుంది. 2024 ప్రపంచకప్ విజయం, ఆ తర్వాత అజేయంగా ఆసియా కప్ చాంపియన్‌గా నిలిచిన భారత్.. ఈ ఫార్మాట్‌లో శత్రు దుర్భేద్యంగా కనిపిస్తోంది. వరల్డ్ నం.1 భారత్, వరల్డ్ నం.2 ఆస్ట్రేలియా తలపడుతున్న టీ20 సిరీస్ అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. భారత్, ఆస్ట్రేలియా తొలి టీ20 పోరు నేడు కాన్‌బెర్రాలో జరుగుతుంది.

**సూర్యకుమార్ మెరిసేనా? :**

పొట్టి ఫార్మాట్‌లో భారత్ గొప్పగా కనిపిస్తోంది. వన్డే సిరీస్‌లో విశ్రాంతి తీసుకున్న జస్‌ప్రీత్ బుమ్రా.. టీ20 సిరీస్‌కు అందుబాటులోకి వచ్చాడు. పేస్ దళపతి రాకతో సహజంగానే బౌలింగ్ విభాగం బలోపేతమైంది. అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా పేస్ దాడి ఎటువంటి ఫలితాలు రాబడుతుందో ఈ సిరీస్ తేల్చనుంది. కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి తుది జట్టులో చోటు కోసం పోటీపడుతుండగా.. పేస ఆల్‌రౌండర్ శివం దూబెతో హర్షిత్ రానా పోటీలో ఉన్నాడు. అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, తిలక్ వర్మ మంచి ఫామ్‌లో ఉన్నారు. ఆసియా కప్‌లో గెలుపు ఇన్నింగ్స్‌లు నమోదు చేసిన ఈ త్రయం ఆసీస్‌తో సిరీస్‌లోనూ భారత్‌కు కీలకం.

కొత్త స్థానంలో పరుగులు చేసేందుకు సంజు శాంసన్ కాస్త ఇబ్బంది పడుతున్నాడు. ఈ సిరీస్‌లో సంజు శాంసన్ మిడిల్ ఆర్డర్‌లో కుదురుకునేందుకు ఎదురుచూస్తున్నాడు. రింకు సింగ్, అక్షర్ పటేల్, శివం దూబె లోయర్ ఆర్డర్‌లో సత్తా చాటాల్సి ఉంది. జట్టు గొప్పగా ఆడుతున్నా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తేలిపోతున్నాడు. గత 14 ఇన్నింగ్స్‌ల్లో సూర్యకుమార్ ఒక్క అర్ధ సెంచరీ సాధించలేదు. బ్యాటింగ్ సగటు 10.50, స్ట్రయిక్‌రేట్ 100.80 మాత్రమే. ఆసియా కప్‌లో తేలిపోయిన సూర్యకుమార్ ఒత్తిడిలో కనిపిస్తున్నాడు. ఈ సిరీస్ సూర్యకుమార్ యాదవ్‌కు వ్యక్తిగతంగా అత్యంత కీలకం.

**ఆసీస్ శిబిరం కొత్తగా.. :**

మిచెల్ మార్ష్ సారథ్యంలో ఆసీస్ దంచికొడుతుంది. మార్ష్ కెప్టెన్సీలో 20 టీ20ల్లో ఆసీస్ రెండు ఓటములు చూసింది. ట్రావిశ్ హెడ్, జోశ్ ఇంగ్లిశ్, టిమ్ డెవిడ్, జోశ్ ఫిలిప్ సహా మిచ్ ఓవెన్, మార్కస్ స్టోయినిస్‌లు భీకర ఫామ్‌లో ఉన్నారు. పరుగుల వేటలో, వికెట్ల వేటలో కంగారూ క్రికెటర్లు అంచనాలను అందుకుంటున్నారు. ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ అందుబాటులో లేకపోయినా.. కంగారూ శిబిరం సరికొత్త ఉత్సాహంగా కనిపిస్తోంది. బౌలింగ్ విభాగంలో జేవియర్ బార్ట్‌లెట్, మాట్ కున్నేమాన్, జోశ్ హాజిల్‌వుడ్, నాథన్ ఎలిస్‌లు ఆసీస్‌కు కీలకం కానున్నారు.

**పిచ్, వాతావరణం :**

భారత్, ఆసీస్ తొలి టీ20 వేదిక కాన్‌బెర్రా సంప్రదాయంగా స్వల్ప స్కోర్ల పిచ్. పెద్ద గ్రౌండ్‌లో స్పిన్నర్ల కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుంది. నేడు మధ్యాహం వేళ వర్షం సూచనలు ఉన్నప్పటికీ.. మ్యాచ్ సమయంలో వర్షం కురిసే అవకాశం లేదు.

# ఫైనల్‌కు చేరేదెవరో ?

**- దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ సెమీస్ నేడు**
**- ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్**

గువహటి : ఐసీసీ మహిళల ప్రపంచకప్ తుది అంకానికి చేరుకుంది. గ్రూప్ దశలో నిలకడగా రాణించిన నాలుగు జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. అగ్ర జట్టు ఆస్ట్రేలియా, ఆతిథ్య జట్టు భారత్ గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో తలపడనుండగా.. ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికాలు నేడు తొలి సెమీఫైనల్లో తాడోపేడో తేల్చుకోనున్నాయి. తొలి సెమీస్ పోరుకు గువహటి వేదిక కానుంది. ఇటు ఇంగ్లాండ్, అటు దక్షిణాఫ్రికా మంచి ఫామ్‌లో ఉన్నాయి. చివరి ఐదు వన్డేల్లో ఇరు జట్లు నాలుగు విజయాలు సాధించాయి. దీంతో నేడు తొలి సెమీఫైనల్ సమవుజ్జీల సమరంగా సాగనుంది. ఆమీ జోన్స్, టామీ బ్యూమోంట్, నటాలీ సీవర్, సోఫియా, సోఫి ఎకెల్‌స్టోన్‌లు ఇంగ్లాండ్‌కు కీలకం కానున్నారు. దక్షిణాఫ్రికా ప్రధానంగా బ్రిట్స్, సునె లుస్, మారిజానె కాప్, నాన్‌కుల్‌లెకో, నదినె డిక్లెర్క్‌లపై ఆధారపడింది. గత రెండు వారాల్లో గువహటిలో మ్యాచులు జరుగలేదు. సెమీఫైనల్ మ్యాచ్‌కు తాజా పిచ్‌ను సిద్ధం చేశారు. సంప్రదాయంగా ఈ పిచ్ స్పిన్నర్లకు కాస్త మొగ్గు. వర్షం సూచనలు లేకపోయినా.. సెమీఫైనల్‌కు రిజర్వ్ డే అందుబాటులో ఉంది.

# రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

## పోలీసు అమర వీరుల త్యాగాల స్ఫూర్తితో రక్తదానం చేసిన జిల్లా ఎస్పీ జగదీష్



**అనంతపురం క్రైం, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** ప్రజల భద్రత, రక్షణలతో పాటు ప్రాణాలను నిలబెట్టడం తమ కర్తవ్యమని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో జిల్లా ఎస్పీ రక్తదానం చేశారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా మంగళవారం నాడు జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లోని షాదీఖానాలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా ఎస్పీ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. రక్తదానం చేయడం అంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మ కల్పించడమేనని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, ఆపరేషన్ల సమయంలో రక్తం పాత్ర కీలకం అవుతుందన్నారు. అలాంటి ఆపద సమయంలో మానవత్వంతో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటం అదృష్టంగా భావించాలన్నారు. ఈనేపథ్యంలో రక్తదానం చేయడంపై ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు. జిల్లా ఎస్పీతో సీఐలు ధరణీకిశోర్, క్రాంతికుమార్, వెంకటేశ్వర్లు, రాజేంద్రనాథ్ యాదవ్.. ఆర్ఐలు పవన్ కుమార్, మధు, ఎస్సై రుష్యేంద్రబాబు, ఆర్ఎస్ఐ మగ్బుల్‌లు రక్తదానం చేశారు. మొత్తం 200 మందికి పైగా సిబ్బంది రక్తదానం చేశారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకు సిబ్బంది, డాక్టర్లు దాతలు నుండీ రక్తం స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సి.ఐ లు వెంకటేశ్వర్లు, రాజేంద్రనాథ్ యాదవ్ , ఆర్ ఐ లు పవన్ కుమార్ , మధు, పోలీస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ ఎస్ ఐ లు బాబ్జాన్ , మగ్బుల్ , రమేష్ నాయక్ , జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ ఎస్ ఐ జాఫర్ , సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్ , లక్ష్మినారాయణ, శివకుమార్, పోలీసు సిబ్బంది మరియు నగరంలోని పలు విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





# రైతుల ఆదాయాన్ని పెంచడంపై దృష్టి పెట్టండి

## పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి సిద్ధార్థ జైన్





**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** రైతుల ఆదాయాన్ని పెంచేందుకు.. పంటలవారీగా ప్రణాళికలు రూపొందించుకోవాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ కోపరేషన్ మరియు పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి సిద్ధార్థ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్ధార్థ జైన్ ఐఏఎస్ జాయింట్ సెక్రెటరీ మినిస్ట్రీ ఆఫ్ కోపరేషన్ న్యూఢిల్లీ మరియు డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ ప్రధానమంత్రి దన్ దన్ ధాన్య కృషి యోజన పథకము వారు, శ్రీ సత్యసాయి జిల్లా క్షేత్ర సందర్శనకు రావడం జరిగింది. ఇందులో భాగంగా చిలమత్తూరు మండలంలోని మరవ కొత్తపల్లి గ్రామంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న, మల్బరీ పంటలను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల యొక్క ఆదాయాన్ని పెంచడంతోపాటు పంటలలో దిగుబడి పెంచాలని అందుకుసంబంధించి పంటలవారీగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ముఖ్యంగా రైతు సాగు చేస్తున్నటువంటి పద్ధతిలో ఉన్నటువంటి గ్యాస్‌ని గుర్తించి వాటికి అధిగమించడానికి తీసుకోవాల్సిన అటువంటి చర్యలను రైతువారీలుగా చేపట్టాలన్నారు. అదేవిధంగా ప్రతి పంటలో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. మొక్కజొన్న సాగు చేస్తున్నటువంటి రైతు మదన్ మోహన్ రెడ్డి గారితో మాట్లాడుతూ వారు వారు ఆచరిస్తున్నటువంటి పద్ధతులను పంట దిగుబడులను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ మొక్కజొన్నకి ప్రభుత్వం వారు మద్దతు ధరతో కొనుగోలు చేసేటట్లు చూడాలన్నారు అదే విధంగా రైతులకి రాయితీ మీద సూక్ష్మ పోషకాలు అందిస్తే మరింత దిగుబడును సాధించడానికి వీలవుతుందని అన్నారు. సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ ప్రతి రైతు కూడా మార్కెట్ ఓరియెంటెడ్ గా పంటలు పండించాలని కోరారు. అదేవిధంగా ప్రభాకర్ రెడ్డి పొలంలో సాగు చేస్తున్నటువంటి మల్బరీ పంటని పరిశీలించి సాగు విధానాన్ని అడిగి తెలుసుకోవడం జరిగినది. అదేవిధంగా బీడు భూములలో మరియు గట్ల మీద చింతసాగును ప్రోత్సహించాలన్నారు దానివల్ల కుటుంబానికి ఉపాధితో పాటు ప్రత్యామ్నాయ ఆదాయం కూడా పొందవచ్చన్నారు. ఆదిశగా రైతులని ప్రోత్సహించాలన్నారు. తర్వాత పుట్టపర్తి మండలం పెడపల్లిలోని ప్రాథమిక సహకార సంఘాన్ని విజిట్ చేయడం జరిగినది. సంఘం పనితీరుని చైర్మన్ మరియు డైరెక్టర్స్ నుంచి అడిగి తెలుసుకోవడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక సహకార సంఘాలని రుణాలు ఎరువులు మరియు యాంత్రికరణ దిశగా బలోపేతం చేస్తే ఆ గ్రామంలో ఉన్నటువంటి రైతులకు అవి సకాలంలో అందుబాటులో ఉంటూ రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు. అదేవిధంగా వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగాన్ని బాగా అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఆర్డిఓ ఆనంద్ హిందూపురం ఏడి ఏ కృష్ణయ్య, జిల్లా సహకార అధికారి శ్రీకృష్ణ నాయక్, చిలమత్తూ రూ వ్యవసాయ అధికారి కవిత, రాణి, హార్టికల్చర్ ఆఫీసర్ మహేష్ మరియు రైతులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

## ఎర్రమ రెడ్డిపాళెం చెరువును పరిశీలించిన కలెక్టర్

**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ సిబ్బందితో సమావేశమై మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్ సమావేశమయ్యారు. అనంతరం రేణిగుంట సమీపంలోని ఎర్రమరెడ్డిపాళెం చెరువును జిల్లా ప్రత్యేక అధికారి పి.అరుణ్ బాబు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు.





## తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



**దొరవారిసత్రం, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుఫాన్‌తో తీరప్రాంతాల్లో వర్షాలు, గాలులు ఉధృతంగా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సూచించారు. మంగళవారం ఆమె దొరవారిసత్రం మండల పరిధిలోని తనియాలి గ్రామం సమీపంలోని కాళంగి నది వంతెన వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అలాగే సూళ్లూరుపేట మండలంలోని మంగళంపాడు గ్రామానికి చెందిన దొంక కలుజు ప్రాంతం ను సందర్శించి, అక్కడి పరిస్థితులను అంచనా వేశారు. ప్రకృతి విపత్తుల సమయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ, "నియోజకవర్గంలో పునరావాస కేంద్రాలను సిద్ధం చేశాము. అవసరమైతే ఎస్‌డీఆర్ఎఫ్ దళాలను కూడా మోహరించేందుకు సిద్ధంగా ఉంచాం. తుఫాన్ తీరం దాటేంతవరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని" తెలిపారు. ఈ కార్యక్రమంలో దొరవారిసత్రం తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, తనియాలి కార్యదర్శి రామయ్యతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ సమావేశం

- హాజరైన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి





**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** శ్రీసత్య సాయి పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్ లో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ అధ్యక్షతన జిల్లా అధికారులతో కలిసి ఏర్పాటుచేసిన రాష్ట్ర శాసనసభ సభ్యుల కమిటీ సమావేశంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సభ్యుల కమిటీ చైర్మన్ వర్ల కుమార్ రాజా, కమిటీ సభ్యులు మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు , చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ , పార్వతీపురం ఎమ్మెల్యే బోనాల విజయచంద్ర, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ ,జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్,జేసి మంత్రి మౌర్య భరద్వాజా ,జిల్లా అధికారులు , ఎస్సీ ఎస్టీ సభ్యులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- నాయుడుపేట మండల వైసీపీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్



**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 28:** మొంథా తుఫాన్ నేపథ్యంలో కురుస్తున్న భారీ వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాయుడుపేట మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్ తెలియజేశారు.ముందా తుఫాన్ ప్రభావంతో మంగళ, బుధ వారాలలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయనితెలిపారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇంటి నుండి బయటకు వెళ్ళవద్దని సూచించారు. భారీ వర్షాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854